ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు



TGTEL/25/A1132

మానవాళికి

# జనం వార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

Q6 NEWS తెలుగు

మేడ్చల్ | మంగళవారం | 04.08.2026 | సంపుటి : 2 | సంచిక : 33 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు


## 'నీట్' నిరసనకారులపై
# కేసులు వెనక్కి

### ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు
### సుప్రీంకోర్టుకు వివరించిన కేంద్ర ప్రభుత్వం



న్యూఢిల్లీ, ఆగస్ట్ 3 : జంతర్‌మంతర్ వద్ద గత నెలలో విద్యార్థుల ఆందోళనల సందర్భంగా నమోదైన ఎఫ్ఐఆర్ ల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. విద్యార్థులపై నమోదైన కేసులను ముందుకు తీసుకెళ్లబోమన్న తమ హామీకి కట్టుబడి ఉన్నామని ధర్మాసనానికి కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ హామీని అత్యంత బాధ్యతగా అమలు చేయాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం, ప్రభుత్వం కోర్టుకు ఇచ్చిన హామీ కేవలం మాటల్లోనే కాకుండా ఆచరణలోనూ కనిపించాలని పేర్కొంది. గతంలో ఇచ్చిన హామీలకు విరుద్ధంగా విద్యార్థులపై అనవసరమైన చట్టపరమైన చర్యలు

-మిగతా 2 లో..



02

'నీట్' నిరసనకారులపై కేసుల ఉపసంహరణకు

### రాష్ట్రాలకు పూర్తి స్వేచ్ఛ

సుప్రీంకోర్టు వ్యాఖ్యలు



## సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు

### బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను ప్రధాన న్యాయమూర్తితో కలిపి 34 నుంచి 38కి పెంచుతూ జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు.**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 3 :** నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, రామమందిర విరాళాల నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విపక్ష సభ్యులు నినాదాలు చేస్తుండటంతో ఎలాంటి చర్చ లేకుండానే బిల్లు ఆమోదం పొందింది. ఆర్డినెన్స్ జారీని వ్యతిరేకిస్తూ విపక్ష సభ్యులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కూడా మూజువాణి ఓటుతో సభ తిరస్కరించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య సవరణ బిల్లు-2026ను సభలో ప్రవేశపెట్టిన సందర్భంగా కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ దాని గురించి వివరించారు. అనంతరం

-మిగతా 2 లో..



## నిలకడగా కృష్ణా
# వరద ప్రవాహం

### వంద టీఎంసీలకు చేరువలో శ్రీశైలం
### జూరాలకు 1.92 లక్షల క్యూసెక్కుల ప్రవాహం

హైదరాబాద్, ఆగస్ట్ 3 : శ్రీశైలం జలాశయానికి నిలకడగా కృష్ణా ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలకు గాను సోమవారం రాత్రి 93.58 టీఎంసీలకు చేరుకుంది. మంగళవారం నాటికి 100 టీఎంసీలకు చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు. జూరాల జలాశయంలోకి 1.92 లక్షల క్యూసెక్కుల ప్రవాహం చేరుతోంది. ప్రాజెక్టు 27 గేట్లు ఎత్తి 1.85 లక్షల క్యూసెక్కులు, జల విద్యుదుత్పత్తి ద్వారా 31 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఆలమట్టి జలాశయంలోకి 1.36 లక్షల క్యూసెక్కుల వరద చేరుతోంది. దిగువకు 1.50 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. నారాయణపుర్ జలాశయంలోకి 1.40 లక్షల క్యూసెక్కుల వరద చేరుతుండగా.. దిగువకు 1.41 లక్షల క్యూసెక్కులు వదులుతున్నారు. కర్ణాటక ప్రాజెక్టుల నుంచి దిగువకు నీటి విడుదల పెరిగిన క్రమంలో జూరాలకు మంగళవారం నాటికి వరద మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మరోవైపు గోదావరిలోకి ప్రవాహం గణనీయంగా తగ్గింది. శ్రీరామ సాగర్ ప్రాజెక్టుకు 5 వేల క్యూసెక్కులు వస్తున్నాయి. ఎల్లంపల్లికి 3 వేల క్యూసెక్కులు వస్తున్నాయి. మేడిగడ్డ బ్యారేజీకి 2.30 లక్షల క్యూసెక్కులు వస్తుండగా సమ్మక్క బ్యారేజీ వద్ద 3.84 లక్షల క్యూసెక్కులు, భద్రాచలం ఎగువ ఉన్న సీతమ్మ సాగర్ బ్యారేజీ వద్ద 7.12 ల క్షల క్యూసెక్కుల ప్రవాహం నమోదవుతోంది.

## యువత ఆత్మహత్యాయత్నాలకు
# కాంగ్రెస్ కారణం

### నిరుద్యోగులను మోసం చేసిన రేవంత్ సర్కారు

**ఉద్యోగాల భర్తీ పేరుతో ఆటలాడుకున్నారు**

**రాహుల్, రేవంత్‌లు తెలంగాణ యువతరానికి క్షమాపణ చెప్పాలి**

**మీడియా సమావేశంలో మండిపడ్డ కేటీఆర్**

హైదరాబాద్,ఆగస్ట్3 : రాష్ట్రంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను సిఎం రేవంత్ రెడ్డి పూర్తిగా విస్మరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. యూత్ డిక్లరేషన్ పేరిట ప్రచారంతో కాంగ్రెస్ ఊదరగొట్టిందని విమర్శించారు. జాబ్‌లు భర్తీ చేయకపోవడంతో ఓ యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. ఈ మేరకు సోమవారం పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో కెటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 20వేల పోలీసు ఉద్యోగాల ఖాళీలు ఉంటే.. 7 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడమేంటన్నారు. ఉద్యోగాలు అడిగితే ఎండ్రిన్ తాగి చావాలని.. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను క్రిమినల్ వేస్ట్ అని సీఎం అంటున్నారు. ముఖ్యమంత్రి బాధ్యత లేకుండా మాట్లాడు తున్నారని మండిపడ్డారు. సీఎం వ్యాఖ్యలపై

-మిగతా 2 లో..





## సాగునీటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులే లక్ష్యం

**సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయపరమైన స్పష్టత**

**రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా సద్వినియోగం చేసుకోవాలి**

**పాలమూరు-రంగారెడ్డి, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులకు ప్రాధాన్యం**

**సాధ్యమైనంతవరకు ఆరు నెలల్లో పక్రియ పూర్తిచేయాలని లక్ష్యం**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**రాష్ట్ర సాగునీటి భవిష్యత్తుకు అత్యంత కీలకమైన నాలుగు ప్రధాన ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు సాధించే పక్రియను ఇకపై కాలపరిమితితో కూడిన కార్యాచరణగా ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులను అత్యున్నత ప్రాధాన్య జాబితాలో ఉంచి, సాధ్యమైనంతవరకు ఆరు నెలల్లో ప్రాజెక్టులవారీగా పర్యావరణ అనుమతులు సాధించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు.**

హైదరాబాద్, ఆగస్ట్ 3 : పర్యావరణ అనుమతుల పక్రియకు సంబంధించి సుప్రీంకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పు న్యాయపరమైన స్పష్టతను కల్పించడంతోపాటు రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల అనుమతుల సాధనకు కొత్త అవకాశాల ద్వారాలను తెరిచిందని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకొని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖతోపాటు సంబంధిత

- మిగతా 2 లో..

## ఈయేడు కుంభవృష్టి
# వర్షాలు తప్పవు

### వర్షాలతో ప్రాణనష్టం కూడా ఎక్కువే
### రంగం భవిష్యవాణిలో మాతంగి వెల్లడి



02

సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో మాతంగి స్వర్ణలత భవిష్యవాణి(రంగం) వినిపించారు. మీరెవరూ నేను చెప్పింది ఏదీ ఆచరించడం లేదంటూ మాతంగి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడకు నేను సంతోషంగా రాలేదు.. క్రోధంతో వచ్చానని అన్నారు. మీ ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పాలని నిలదీశారు. నా విగ్రహం ప్రతిష్ట చేస్తానని మాట ఇచ్చి జరిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఆపద వచ్చినా.. ప్రమాదం వచ్చినా కాపాడుతున్నానని మాతంగి స్వర్ణలత తెలిపారు.



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| పారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 235 (కిలో) |
| స్కిన్ లెస్ | 267 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74

## నా విద్యార్హతలు.. రుణాలు
# తెరిచిన కాగితం

### బోస్టన్ వర్సిటీలో చదవడంపై వారికెందుకంత కచ్చ

**బిజెపి నేతలు కూడా వారి విద్యార్హతలు తెలిపితే మంచిది**

**అభిజిత్ దీప్కే ఘాటు స్పందన**

ముంబై, ఆగస్ట్ 3 : బీజేపీ కార్యకర్త ఒకరు సమాచార హక్కు చట్టం ఆర్టీఐ ద్వారా తన విద్యార్హతల వివరాలను కోరడంపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పందించారు. బీజేపీ నేతలు కూడా కూడా తమ విద్యకు సంబంధించిన డిగ్రీలను బహిరంగపరచాలని సవాల్ చేశారు. 'నా స్కాలర్‌షిప్ లేఖ, విద్యారుణ లేఖను వెల్లడించడానికి నేను సిద్ధంగా ఉన్నా. చక్రవర్తి తన డిగ్రీని చూపిస్తారా అని

-మిగతా 2 లో..





## పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై అసంతృప్తి

02

ఇందిరాపార్క్ వద్ద నిరుద్యోగుల మెరుపు ధర్నా

**19వేల ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్**

## సహజీవనం కూడా
# చట్టబద్ధమైన జీవితమే

### భాగస్వామిని వేధింపులకు గురి చేస్తే చట్టప్రకారం శిక్ష

**సుప్రీం ధర్మాసనం సంచలన తీర్పు**

న్యూఢిల్లీ, ఆగస్ట్ 3 : సహజీవనం అంశంపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. సహజీవనంలో భాగస్వామిని వేధింపులకు గురి చేస్తే భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 498-ఏ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని స్పష్టం చేసింది. పెళ్లి కాలేదనే కారణంతో భర్త స్థానంలో ఉన్న వ్యక్తి వేధింపుల ఆరోపణల నుంచి తప్పించుకోలేరని పేర్కొంది. వివాహం జరగలేదన్న కారణాన్ని చూపి బాధితురాలికి చట్టపరమైన రక్షణ కల్పించకపోవడం

-మిగతా 2 లో..



# విద్యార్థులపై కేసులు వెనక్కి

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగించకూడదని సూచించింది. విద్యార్థులపై బలవం తపు చర్యలు తీసుకోవద్దని ఇప్పటికే సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే నమోదైన ఎఫ్ఐఆర్‌ల దర్యాప్తు అంశంపై వివాదం కొనసాగుతుండటంతో, ప్రభుత్వం తన హామీ ని ఎలా అమలు చేస్తుందనే అంశంపై కోర్టు దృష్టి సారించింది. ఇక విద్యార్థుల ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్న సీజేపీ మాత్రం ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అన్ని ఎఫ్ఐఆర్‌లను పూర్తిగా ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేస్తోంది. హామీలు అమలు కాకపోతే దేశవ్యాప్తంగా మళ్లీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించింది.

### కేసుల ఉపసంహరణకు రాష్ట్రాలకు పూర్తి స్వేచ్ఛ: సుప్రీం

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఆందోళనల కారణంగా నిరసనకారులపై నమోదైన కేసులను చట్ట ప్రకారం ఉపసంహరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు పూర్తి స్వేచ్ఛ ఉందని సుప్రీంకోర్టు తెలిపింది. జులై 20న దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన ఆందోళనలకు సంబంధించిన పిటిషన్ల విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. దీంతో వివిధ రాష్ట్రాల్లో కేసులు ఎదుర్కొంటున్న వారికి ఊరట లభించనుంది. అలాగే "తీవ్రమైన నేరచరిత్ర కలిగినవారు" అనే పదం హత్య, అత్యాచారం, ఉగ్రవాదం వంటి అత్యంత తీవ్రమైన నేరాలకు మాత్రమే వర్తిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. చిన్నచిన్న కేసులు ఎదుర్కొంటున్న వారిని ఆ కోవలో చూడరాదని పేర్కొంది. నిరసనలకు సంబంధించిన అంశాలపై విచారణకు ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు కోర్టు తెలిపింది. పెల్లెట్ తుపాకుల వినియోగంపై సమగ్ర మార్గదర్శకాలు రూపొందిస్తామని వివరించింది. ఎలాంటి పరిస్థితుల్లో వాటిని ఉపయోగించవచ్చో నిర్ణయిస్తామని వెల్లడించింది. తదుపరి విచారణను కోర్టు ఆగస్టు 19కి వాయిదా వేసింది.



# ఈయేడు కుంభవృష్టి వర్షాలు తప్పవు

### వర్షాలతో ప్రాణనష్టం కూడా ఎక్కువే

### రంగం భవిష్యవాణిలో మాతంగి వెల్లడి

**హైదరాబాద్, ఆగస్ట్ 3 :** సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో మాతంగి స్వర్ణలత భవిష్యవాణి(రంగం) వినిపించారు. మీరెవరూ నేను చెప్పింది ఏదీ ఆచరించడం లేదంటూ మాతంగి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడకు నేను సంతోషంగా రాలేదు.. క్రోధంతో వచ్చానని అన్నారు. మీ ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పాలని నిలదీశారు. నా విగ్రహం ప్రతిష్ట చేస్తానని మాట ఇచ్చి జరిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఆపద వచ్చినా.. ప్రమాదం వచ్చినా కాపాడుతున్నానని మాతంగి స్వర్ణలత తెలిపారు. కానీ మీరు చేసే చర్యలే నాకు ఆగ్రహం తెప్పిస్తుందని అన్నారు. వావివరసలు లేకుండా ఘోరాలు జరుగుతున్నాయని.. అలాంటి వారిని వదిలిపెట్టనని అన్నారు. వారిని పాదాల కింద నలిపేస్తానని అన్నారు. ఈ ఏడాది ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాతంగి భవిష్యవాణిలో చెప్పారు. ఈ ఏడాది కుంభవర్షాలు ఉన్నాయని తెలిపారు. అగ్నిప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాది ప్రాణనష్టం భారీగా జరుగుతుందని అన్నారు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కొంతమంది కళ్లు నెత్తికెక్కి ప్రవర్తిస్తున్నారని మాతంగి స్వర్ణలత ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి ప్రవర్తన తనకు సంతోషం కలిగించడం లేదని తెలిపారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర చివరి ఘట్టానికి చేరుకుంది. ఈ ఉత్సవాల్లో భాగంగా రంగం భవిష్యవాణిని మాతంగి స్వర్ణలత వినిపించారు. తాను సంతోషంగా లేనని.. క్రోధంతో వచ్చానని భవిష్యవాణిలో చెప్పారు. ఈ ఏడాది కుంభవృష్టి ఉంది. వర్షాల్లో ప్రజలు కొట్టుకుపోయే పరిస్థితి ఉంది. రంగం భవిష్యవాణితో ఈ బోనాల జాతర ముగియనుంది. ఈ నేపథ్యంలో భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. రంగం అనంతరం అమ్మవారిని అంబారీపై ఊరేగించనున్నారు.

### నా విద్యార్హతలు.. రుణాలు

# తెరిచిన కాగితం

(మొదటిపేజీ తరువాయి)

అభిజిత్ ప్రధాని మోదీ విద్యార్హతను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, బీజేపీ నాయకులు కూడా తమ విద్యార్హతలను బహిరంగపరుస్తారా? అని అభిజిత్ దీప్కే ప్రశ్నించారు. 'ఒక బీజేపీ కార్యకర్త నాపై ఆర్‌టిఐ దాఖలు చేసి, నా చదువు ఎలా పూర్తి చేశానో తెలుసుకోవాలనుకుంటున్నట్లు ఇప్పుడే చూశాను. మీ నాయకులు వారి డిగ్రీని చూపిస్తారా అని ఆయనను నేను అడగాలనుకుంటున్నా అని అన్నారు. మరోవైపు తన విద్యా నేపథ్యం ఎందుకు ఒక సమస్యగా మారింది? అని అభిజిత్ ప్రశ్నించారు. 'ఒక సాధారణ యువకుడు బోస్టన్ యూనివర్సిటీలో చదివితే వారికేం బాధ. విద్య పట్ల మీకెందుకంత వ్యతిరేకత? అని నిలదీశారు. బోస్టన్ యూనివర్సిటీ స్కాలర్‌షిప్, విద్యా రుణంతో తన చదువు కోసం ఆర్థిక సహాయం పొందినట్లు ఆయన వివరించారు. విద్యా రుణం తిరిగి చెల్లించాల్సి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ దీనిపై విచారణ జరుపవచ్చని దీప్కే అన్నారు. నీట్ లీక్ వివాదంపై నిరసన ఉద్యమానికి నేతృత్వం వహించడానికి జూన్‌లో భారత్‌కు ఆయన తిరిగి వచ్చారు.

# సహజీవనం కూడా చట్టబద్ధమైన జీవితమే

(మొదటిపేజీ తరువాయి)

రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధమని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా భర్త అనే పదానికి ధర్మాసనం విస్తృత వివరణను ఇచ్చింది. సహజీవన చేస్తున్న వ్యక్తిని భర్తతో సమానంగా పరిగణించవచ్చని తెలిపింది. ఇలాంటి వ్యక్తులు భాగస్వామిని వేధించి తప్పించుకోలేరని ధర్మాసనం పేర్కొంది. అయితే, అన్ని రకాల సహజీవనాలకు ఈ తీర్పు వర్తించదని స్పష్టం చేసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేస్తూ హింసకు పాల్పడిన వారికే సెక్షన్ 498-ఏ వర్తిస్తుందని వెల్లడించింది. అలాగే, ప్రాథమిక విచారణ నిర్వహించకుండా తక్షణ అరెస్టులు చేయవద్దని పోలీసులకు కఠిన ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా సెక్షన్ 498-ఏ ఉద్దేశాన్ని ధర్మాసనం వివరించింది. ఈ సెక్షన్ మహిళలను భర్త లేదా అతని కుటుంబ సభ్యుల మానసిక, శారీరక వేధింపుల నుంచి రక్షించడానికే అని గుర్తు చేసింది. అలాంటి వేధింపులు కేవలం చట్టబద్ధమైన వివాహ బంధంలోనే జరుగుతాయని భావించడం వాస్తవాలకు విరుద్ధమని వ్యాఖ్యానించింది. వివాహిత మహిళకు ఒక రకమైన రక్షణ కల్పించి, అదే తరహా సంబంధంలో ఉన్న మరో మహిళకు రక్షణ నిరాకరించడం సహేతుకం కాదని ధర్మాసనం అభిప్రాయ పడింది. వ్యక్తిగత స్వేచ్ఛలో భాగంగా జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కును చట్టం గుర్తించిందని ధర్మాసనం తెలిపింది. ఆ విధంగా భాగస్వామిని ఎంచుకున్న మహిళకు చట్టపరమైన రక్షణను నిరాకరించలేమని పేర్కొంది. సహజీవనం చేస్తున్న మహిళకు తన భాగస్వామి లేదా అతని కుటుంబ సభ్యుల నుంచి వేధింపులు ఎదురైతే ఆమెకు కూడా సమాన చట్టపరమైన రక్షణ కల్పించాల్సిందేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది.

# సాగునీటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)



చట్టబద్ధ సంస్థల వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రతి అర్హమైన ప్రతిపాదనను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులు, న్యాయపరమైన అంశాలు, పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై సోమవారం రోజున రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ బలరాం నాయక్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. సుప్రీంకోర్టు తాజా తీర్పులో పేర్కొన్న అంశాలను ప్రస్తావించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, గతంలో చట్టబద్ధంగా పర్యావరణ అనుమతులు పొందిన ప్రాజెక్టులకు ఆ రక్షణ కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటికే పరిశీలనలో ఉన్న దరఖాస్తులను సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించే అవకాశం ఉందన్నారు. గతంలో తిరస్కరణకు గురైన ప్రతిపాదనలను ప్రాజెక్టులవారీగా సమగ్రంగా పరిశీలించి, సాంకేతిక, విధానపరమైన లోపాలను సరిదిద్దిన అనంతరం చట్టపరంగా అవకాశం ఉన్నచోట తిరిగి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులపై సుదూర ప్రభావం చూపగల ఈ తీర్పు వెలువడటం వెనుక తెలంగాణ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు సాధించేందుకు నిరంతరంగా సాగించిన న్యాయపోరాటం ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ తీర్పులోని న్యాయసూత్రాలను లోతుగా అధ్యయనం చేసి, రాష్ట్రంలోని ప్రతి ప్రాజెక్టుకు అవి ఏ విధంగా వర్తిస్తాయో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. తెలంగాణ సాగునీటి ప్రయోజనాల పరిరక్షణలో అంతర్రాష్ట్ర విభాగం అత్యంత కీలకమని ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ విభాగాన్ని తగిన సాంకేతిక, పర్యావరణ, న్యాయ నిపుణులతో మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం, జాతీయ హరిత ట్రిబ్యునల్?ఎన్‌జీటీ, సుప్రీంకోర్టు, ఇతర న్యాయస్థానాలు, చట్టబద్ధ సంస్థల ముందు తెలంగాణ వాదనను శాస్త్రీయ ఆధారాలు, సమగ్ర పత్రాలతో బలంగా వినిపించే సామర్థ్యాన్ని పెంపొందించాలన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి చరిత్ర అధికారుల వద్ద అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. అసలు పర్యావరణ అనుమతులు, ఆ తర్వాత ప్రాజెక్టు పరిధిలో చోటుచేసుకున్న మార్పులు, రీడిజైన్, విస్తరణ, ప్రాజెక్టు ప్రాంత మార్పు, పెండింగ్ దరఖాస్తులు, న్యాయస్థానాల్లో కొనసాగుతున్న కేసులు, పాటించాల్సిన నిబంధనలు, జరిమానాలు ఉంటే వాటి వివరాలు ఇలా ప్రతి అంశాన్ని ఒకే సమగ్ర దస్త్రంలో పొందుపరచాలని ఆదేశించారు. పర్యావరణ అనుమతుల సాధనకు మంత్రి దశలవారీ కార్యాచరణను నిర్దేశిరచారు. ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి, అందుబాటులో ఉన్న పత్రాలు, రికార్డులన్నింటినీ ఏడు రోజుల్లో సమీకరించాలని ఆదేశించారు. నవీకరించిన పర్యావరణ అధ్యయనాలు, నిబంధనల అమలు నివేదికలు, భూ రికార్డులు, న్యాయపరమైన పత్రాలు, ఇతర అవసరమైన దస్త్రాలను 30 రోజుల్లో సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ప్రధాన పరిపాలనా పక్రియతోపాటు దరఖాస్తుల తయారీ, పరిశీలన, సమర్పణకు సంబంధించిన దశలను 60 రోజుల్లో పూర్తిచేయాలని సూచించారు. చట్టబద్ధ విధానాలు, సంబంధిత సంస్థల పరిశీలనకు లోబడి సాధ్యమైన ప్రతి ప్రాజెక్టుకు ఆరు నెలల్లో పర్యావరణ అనుమతులు సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు. ప్రాజెక్టుల పురోగతిపై ప్రతి వారం నివేదిక సమర్పించాలని, ప్రతి నెలా ఉన్నతస్థాయిలో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. నిర్ణీత గడువుల అమలులో అలసత్వం, నిర్లక్ష్యానికి ఏమాత్రం తావులేదని స్పష్టం చేశారు. ర్యావరణ ప్రభావ అధ్యయనాలు, పునరావాస పునర్నిర్మాణ ప్రణాళికలు, అటవీ అనుమతుల దస్త్రాలు, భూసేకరణ రికార్డులు, న్యాయస్థానాల్లో దాఖలు చేయాల్సిన కౌంటర్ అఫిడవిట్ల తయారీలో ఏ చిన్న లోపం ఉన్నా మొత్తం అనుమతుల పక్రియ ఆలస్యమయ్యే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. అందువల్ల ప్రతి పత్రం సాంకేతికంగా, న్యాయపరంగా లోపరహితంగా ఉండేలా చూడాలని సూచించారు. ప్రాజెక్టు డిజైన్లలో గణనీయమైన మార్పులు చేపట్టే ముందే పర్యావరణ, అటవీ, పునరావాసం, భూసేకరణ, పరిహారం తదితర అంశాలను పరిష్కరించాలని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనలను ముందుగానే పాటించడం ద్వారా న్యాయపరమైన వివాదాలను నివారించవచ్చని, అదే సమయంలో రైతులు, భూ యజమానులు, ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాల న్యాయబద్ధమైన ప్రయోజనాలను పరిరక్షించవచ్చని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ఎంత ముఖ్యమో, వాటి పరిధిలో భూములు, జీవనోపాధి కోల్పోతున్న కుటుంబాలకు న్యాయం చేయడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, సామాజిక న్యాయం?ఈ మూడింటి మధ్య సమతుల్యత ఉండేలా ప్రాజెక్టుల కార్యాచరణ కొనసాగాలని సూచించారు. గౌరవెల్లి ప్రాజెక్టును ప్రత్యేకంగా సమీక్షించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పంప్‌హౌస్‌ను పూర్తిస్థాయిలో నిర్వహణకు సిద్ధంగా ఉంచేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఇంజినీర్లను ఆదేశించారు. పంపులను వినియోగంలోకి తీసుకొచ్చే సమయానికి ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందుగానే తనిఖీలు, పరీక్షలు, అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. నిర్దేశిత ప్రామాణిక నిర్వహణ విధానాలను?ఎస్ఓపీలను?కచ్చితంగా అమలు చేయాలన్నారు. ప్రాజెక్టు ఎడమ, కుడి కాలువ వ్యవస్థలను ఇంజినీరింగ్ బృందాలు సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. నీటి స్వేచ్ఛాయుత ప్రవాహానికి అడ్డుగా ఉన్న అవరోధాలను గుర్తించి, అత్యవసర పనులకు అంచనాలు సిద్ధం చేయాలని చెప్పారు. అసంపూర్తిగా ఉన్న కాలువ తవ్వకాలు, గట్ల తొలగింపు లేదా కోత అవసరాలు, నీటి విడుదల కేంద్రాలు, గ్రామాల మధ్య అనుసంధానం, రహదారి క్రాసింగ్‌లు, ప్రజల రాకపోకలకు అవసరమైన వంతెనలు తదితర అంశాలన్నింటినీ ఈ తనిఖీల పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. ప్రస్తుతం ప్రధాన ప్రాధాన్యం అత్యంత కీలకమైన అవరోధాలను తొలగించి, సాధ్యమైనంత త్వరగా నీటిని తరలించగల సామర్థ్యంతో ప్రధాన కాలువల వ్యవస్థను సిద్ధం చేయడమేనని మంత్రి స్పష్టం చేశారు. సీతారామ సాగర్ ప్రాజెక్టుకు అవసరమైన అధ్యయనాలు, పర్యావరణ పత్రాలను ఏమాత్రం ఆలస్యం లేకుండా నవీకరించాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సంబంధిత అనుమతి లేదా న్యాయపరమైన ఆమోదం లభించిన వెంటనే పనులను పునఃప్రారంభించేందుకు వీలుగా చేపట్టాల్సిన ప్యాకేజీలకు సంబంధించిన ఇంజినీరింగ్ ప్రణాళికలు, అంచనాలు, టెండర్ పత్రాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని చెప్పారు. అనుమతులు వచ్చిన తర్వాత మళ్లీ సన్నాహాల పేరుతో సమయం వృథా కాకూడదని స్పష్టం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతుల విషయంలోనూ ఇదే స్థాయి అత్యవసరతతో వ్యవహరించాలని సూచించారు. ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక అధికారుల బృందం ఉండాలని, ఆ బృందం పత్రాల తయారీ, కేంద్ర ప్రభుత్వ విభాగాలతో సమన్వయం, దరఖాస్తుల పురోగతి, పెండింగ్ న్యాయ వ్యవహారాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన ఎన్‌జీటీ, సుప్రీంకోర్టు కేసుల విషయంలో రాష్ట్ర న్యాయ సలహాదారులు, అదనపు అడ్వకేట్ జనరల్, సీనియర్ న్యాయవాదులతో శాఖాధికారులు సన్నిహిత సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి పర్యావరణ కేసును విడివిడిగా సమీక్షించి, నిబంధనల అమలు నివేదికలు, సాంకేతిక రికార్డులు, పర్యావరణ అధ్యయనాలు, కౌంటర్ అఫిడవిట్లను ముందుగానే సిద్ధం చేయాలన్నారు. న్యాయస్థానంలో కేసు విచారణకు వచ్చిన తర్వాత హడావుడిగా సమాచారం సేకరించే పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు. పర్యావరణ అనుమతుల సాధన కోసం రాష్ట్ర బృందానికి నాయకత్వం వహిస్తున్న న్యాయవాది శ్రవణ్‌కుమార్ ఈ సందర్భంగా వివిధ కేసుల ప్రస్తుత స్థితి, సుప్రీంకోర్టు తాజా తీర్పు వల్ల ఏర్పడనున్న న్యాయపరమైన పరిణామాలను సమావేశానికి వివరించారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన సూత్రాలు, అనంతరం కేంద్ర ప్రభుత్వం జారీచేసే మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాజెక్టులవారీ కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి న్యాయబృందం, శాఖాధికారులను ఆదేశించారు.

### యువత ఆత్మహత్యాయత్నాలకు

# కాంగ్రెస్ కారణం

(మొదటిపేజీ తరువాయి)

రాహుల్ గాంధీ స్పందించరా..? యూత్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ 24 హామీలు ఇచ్చి ఒక్కటైనా నెరవేర్చిందా..? అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్న రేవంత్‌రెడ్డే క్రిమినల్ వేస్ట్ అంటూ విమర్శలు గుప్పించారుఉ. సీఎం రేవంత్ రెడ్డి ఏం చదివారో కూడా నాకు డౌటే. ఆయన ఎన్నికల నామినేషన్ పత్రం సొంతంగా నింపుకోగలరా?. ఆయన ఒక్క ఇంటర్వ్యూకైనా వెళ్లారా..?' అని కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో యువత తీవ్ర నిరాశలో ఉందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉద్యోగ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలోని యువత ఒక రకమైన నిర్వేదంలో ఉందన్నారు. దేశ రాజకీయాలను గమనిస్తున్న ప్రతి ఒక్కరికీ ఈ విషయం అర్థమవుతోందని.. ఎన్నికల సమయంలో యువతను వాడుకోవడం కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు అలవాటుగా మారిందన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ ను ప్రస్తావిస్తూ.. రెండేళ్ల క్రితం కూడా ఉద్యోగాల భర్తీపై హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రచార సభల్లో ఇచ్చిన హామీలకు విలువ లేకపోయినా, కనీసం శాసనసభలో ఇచ్చిన మాటకైనా విలువ ఉండాలని అన్నారు. ఇటీవల ఖమ్మంలో వేణు అనే విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటనను ప్రస్తావించిన కేటీఆర్.. అతడు రాసిన సూసైడ్ నోట్‌లో రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు చేరే వరకు షేర్ చేయాలని పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. ఆ లేఖలో తమను కూడా ప్రస్తావించారని, అయితే అది సాధారణ సూసైడ్ నోట్ కాదని, కాంగ్రెస్ ప్రభుత్వంపై రాసిన చార్జ్‌షీట్‌లాంటిదని అన్నారు. అశోక్‌నగర్‌లో రాహుల్ గాంధీ ఇచ్చిన ఉద్యోగ హామీలను గుర్తు చేస్తూ.. ఉద్యోగాలు ఇవ్వకపోతే రాహుల్ గాంధీ ఇప్పుడు తెలంగాణకు ఎందుకు రావడం లేదు.? ఎక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందో అక్కడికి వెళ్లరు.. కానీ తమ ప్రభుత్వం లేని రాష్ట్రాల్లో మాత్రం రాజ్యాంగ పుస్తకం పట్టుకుని తిరుగుతారంటూ విమర్శించారు. చివరగా ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో మాజీమంత్రి జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### టీజీఎస్ ఆర్టీసీలో 1,743 ఉద్యోగాల

# ఎంపిక ఫలితాలు విడుదల




**హైదరాబాద్,ఆగస్ట్3 :** ఆర్టీసీలో డ్రైవర్, శ్రామిక్ పోస్టుల ఎంపిక ఫలితాలను తెలంగాణ పోలీసు నియామక మండలి సోమవారం విడుదల చేసింది. గతేడాది సెప్టెంబర్ 17న మొత్తం 1743 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా.. మొత్తం 1604 మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్లు తెలిపింది. ఈ మేరకు వెబ్‌సైట్‌లో ఓ నోట్‌ను విడుదల చేసింది. 1000 డ్రైవర్ పోస్టులకు 894మంది ఎంపిక కాగా.. 743 శ్రామిక్ పోస్టులకు 710మంది ఎంపికయ్యారు. డ్రైవర్ పోస్టుకు సంబంధించిన డ్రైవింగ్ టెస్ట్ మార్కుల షీట్‌లు అభ్యర్థుల లాగిన్‌లలో అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది. సెలక్షన్ జాబితాలు, అన్ని కేటగిరీల వారీగా కటాఫ్ మార్కులను తమ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు బోర్డు తెలిపింది. తుది నియామకం అభ్యర్థుల క్యారెక్టర్, ప్రవర్తన వెరిఫికేషన్, వైద్య పరీక్షల్లో అర్హత సాధించడంపై ఆధారపడి ఉంటుందని పేర్కొంది. ఆగస్టు 7న ఉదయం 8గంటల నుంచి 11వ తేదీ అర్ధరాత్రి వరకు డిజిటల్ రూపంలో అటెస్టేషన్ ఫారం నింపాల్సి ఉంటుందని తెలిపింది. ఆగస్టు 17న మూడు కాపీల అటెస్టేషన్ ఫారాలు, సంబంధిత ధ్రువపత్రాలను ఆయా పోలీస్ జిల్లా, కమిషనరేట్ కార్యాలయాల్లో సమర్పించాలని బోర్డు ఛైర్మన్ వీవీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



# పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై అసంతృప్తి

### ఇందిరాపార్క్ వద్ద నిరుద్యోగుల మెరుపు ధర్నా

### 19వేల ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్

**హైదరాబాద్,ఆగస్ట్3 :** తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల భర్తీ పక్రియపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిరుద్యోగ యువత హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ చౌరస్తాలో సోమవారం మెరుపు ధర్నాకు దిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 7,437 పోలీస్ పోస్టుల నోటిఫికేషన్ సరిపోదని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సుమారు 19 వేల పోలీస్ పోస్టుల భర్తీకి మరో సమగ్ర నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నోటిఫికేషన్ విడుదలలో జరిగిన జాప్యం కారణంగా వేలాది మంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయారని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఉద్యోగాలకు అర్హత కోల్పోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలంటే వయోపరిమితిని పెంచాల్సిందేనని ప్రభుత్వాన్ని కోరారు. పోలీస్ నియామక నోటిఫికేషన్‌లో కానిస్టేబుల్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని 36 సంవత్సరాలకు, సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) పోస్టులకు 38 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే దరఖాస్తు రుసుము కూడా నిరుద్యోగులపై అదనపు భారం అవుతోందని, దానిని వెంటనే తగ్గించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన నిరుద్యోగులు, తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పోలీస్ ఉద్యోగాల భర్తీలో పారదర్శకతతో పాటు నిరుద్యోగులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నేతలు మధుసూదన్ గౌడ్, శ్రీకాంత్, వీరేష్, కరుణాకర్, శ్రీకాంత్ రాథోడ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు

(మొదటిపేజీ తరువాయి)

బిల్లుపై సభ్యులు మాట్లాడాలని సభాపతి ఓం బిర్లా కోరినప్పటికీ, విపక్షాల నినాదా లు కొనసాగడంతో బిల్లును ఓటింగ్‌కు పెట్టారు. దీంతో ఎలాంటి చర్చ లేకుండానే న్యాయమూర్తుల సంఖ్య సవరణ బిల్లు-2026కు సభ ఆమోదం తెలిపింది. ఇటీవల జనన, మరణాల నమోదు చట్ట సవరణ బిల్లు కూడా లోక్‌సభలో చర్చ లేకుండానే ఆమోదం పొందింది. తాజా బిల్లు ఆమోదం అనంతరం లోక్‌సభను స్పీకర్ వాయిదా వేశారు.

# హామీలను మోసగిస్తున్న పాలకులు!



**తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తోంది. ప్రధాన సమస్యలపై ఇప్పటికీ స్పష్టత లేకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. ముఖ్యంగా ధరణి విషయంలో ఎన్నో చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పటికీ దీనిపై స్పష్టత లేదు. ఎన్ని భూములు అన్యాకాంత్రం అయ్యాయో తెలియదు. దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్య తీసుకోలేదు. దేవాదాయ భూములు తెలంగాణలో వేల ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయి. కొందరు దౌర్జన్యంగా అవి పట్టాలు చేయించుకుని, రైతుభరోసా కూడా పొందుతున్నారు. ఈ భూములను స్వాధీనం చేసుకోవడంలో గత కెసిఆర్ ప్రభుత్వం, రేవంత్ ప్రభుత్వం కూడా విఫలమయ్యింది. మంత్రి కొండా సురేఖ ఉత్సవ విగ్రహంలా తయారయ్యారన్న విమర్శలు ఉన్నాయి. ఎపిలో కూడా ఇలాంటి భూములపై చంద్రబాబు ఒక్కమాటా మాట్లాడడం లేదు.**

ఇకపోతే కాలేశ్వరంపై విమర్శలు తప్ప ఉన్న ప్రాజెక్టును ఉపయోగించుకునే ఆలోచన చేయడంలేదు. జర్నలిస్టుల అక్రిడిటేషన్లపై గందరోగళం జరుగుతోంది. దీనిని సజావుగా పరిష్కరించడం లేదు. కోర్టుల్లో కేసులు కూడా దాఖలు అయ్యాయి. జర్నలిస్టులు ఇంటిస్థలాలు, ఆరోగ్య కార్డులు ఊసే లేదు. ఇప్పటికే ఉమ్మడి ఎపిలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి కేటాయించిన 70 ఎకరాల భూమిని కాజేసే కుట్రలు మొదలయ్యాయి. సుప్రీంకోర్టు తీర్పును బూచిగా చూపి, వేలకోట్ల విలువ చేసే భూమిని లాగేసుకుని, జర్నలిస్టులకు మొడిచేయి చూపేందుకు రంగం సిద్దం చేశారు. ఇందులో కొందరు జర్నలిస్టుల పాత్రకూడా ఉంది. జర్నలిస్టులకు అన్యాయం చేయడంలో టిడిపి ప్రభుత్వం, జగన్ ప్రభుత్వం కూడా ఎపిలో ఇదే తరహా పోకడలు సాగించింది. ఇక అన్నింటికన్నా పెద్ద సమస్య నిరుద్యోగ సమస్య. మొన్నటికి మొన్న ఢిల్లీలో కాక్రోచ్ జనతాపార్టీ ఆందోళనలకు మద్దతు తెలిపిన రాహుల్, రేవంత్ రెడ్డిలు తెలంగాణ నిరుద్యోగుల ఆందోళనలకు మాత్రం సమాధానం చెప్పడం లేదు. ఇక్కడా అలాంటి ఉద్యమం వస్తే తప్ప వీరు స్పందించేలా లేరు. క్యాలెండర్లు మారాయి కానీ కొలువులు మాత్రం రావడలేదని ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. తెలంగాణలో ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలిస్తానన్న కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు దాటినా నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. ఇటీవలే సిఎం రేవంత్ 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. అంటే ఆయన ఇచ్చిన హామీని ఆయనే నెరవేర్చలేదని చెబుతున్నారు.

అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు రెండేండ్లు పూర్తయినా.. నోటిఫికేషన్లు విడుదల చేయలేదు. నోటిఫికేషన్లపై మాట తప్పిన సర్కార్ మీద నిరుద్యోగులు ఆగ్రహంగా ఉన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్.. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ.. నాలుగువేల రూపాయల చొప్పున నిరుద్యోగ భృతి.. ఇదీ కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ. కానీ, అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను విస్మరించింది. జాబ్ క్యాలెండర్ జాడ లేదు. నిరుద్యోగ భృతి ఊసులేదు. 'ఇదిగో మా నిబద్ధత..' అంటూ 2024 ఆగస్టు 2న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్‌ను ప్రవేశపెట్టారు. 15 రకాల నోటిఫికేషన్లు ఇస్తామని చెప్పారు. ఈ క్యాలెండర్ గడువు కూడా ముగిసింది. కానీ, అందులో పేర్కొన్న ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల కాలేదు. 2025 ఆగస్టు 2,శనివారంతో 2026 ఆగస్టు 2 కూడా గడిచిపోయింది.రెండేండ్ల గడువు పూర్తయ్యింది. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు విలువ లేకుండా పోయింది. నిరుద్యోగ యువతను తమవైపు తిప్పుకొనేం దుకు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్ ప్రకటించింది. దీనిని ఎన్నికల మ్యానిఫెస్టోలో సైతం పొందుపరిచింది. కానీ, డిక్లరేషన్‌లో ప్రకటించిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. ఉద్యోగాలొచ్చే వరకు యువతకు నెలకు రూ. 4వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని కూడా కాంగ్రెస్ నేతలు మరచిపోయారు. అమ్మాయిలకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తామన్న హామీని కూడా నెరవేర్చలేదు. రూ.5 లక్షల విద్యాభరోసా కార్డు, రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామన్న హామీని పట్టించుకోలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఏటా దాదాపు 9వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్ అవుతున్నట్లు అంచనాలు ఉన్నాయి. వీరితోపాటు విద్యుత్తు సంస్థలు, పలు బోర్డులు, విభాగాల్లోనూ పెద్దఎత్తున ఉద్యోగ విరమణ పొందుతున్నారు. తాజా గణాంకాల ప్రకారం పాఠశాల విద్యాశాఖలో 14వేలకుపైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అంటున్నారు. యూనివర్సిటీల్లో 2వేలకుపైగా బోధన, మరో 2,800 బోధనేతర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గురుకులాల్లో ఆరువేలు, ఆర్టీసీలో మూడువేలకుపైగా, పోలీసుశాఖలో 17వేలకుపైగా ఖాళీలున్నాయి. ఎక్సైజ్ శాఖలో వెయ్యి, అంగన్‌వాడీల్లో 15వేలకుపైగా, మైనారిటీ సంక్షేమ శాఖలో మూడువేలకుపైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఇలా పలు శాఖల్లో పెద్దఎత్తున ఖాళీలున్నా సర్కార్ నోటిఫికేషన్లు విడుదల చేయడంలేదన్న ఆందోళన నిరుద్యోగుల్లో ఉంది. మరోవైపు రాష్ట్రంలో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉండటం గమనార్హం. మూడు లక్షల మంది రెగ్యులర్ ఉద్యోగులుంటే అంతే స్థాయిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. దీనికి గత కెసిఆర్ ప్రభుత్వం ప్రధాన దోషిగా ప్రకటించాలి. ఇంటికో ఉద్యోగం అంటూ మోసం చేసి, అలా అనలేదని బుకాయించారు. లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెట్టుమీద ఆకులతో ఇస్తార్లు కుట్టినట్లు లెక్కలు చెప్పారు. ఏతావాతా ఎవరు అధికారంలోకి వచ్చినా తమ స్వప్రయోజనాలు తప్ప ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని తేల్చారు. అలు కెసిఆర్, రేవంత్, చంద్రబాబు, జగన్ ఎవరైనా ప్రజలు మాటలతో బురిడీ కొట్టించడంలో ఆరితేరారు.

# జార్ఖండ్‌లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీక్

- సమగ్ర విచారణ జరపాలంటూ విద్యార్థుల డిమాండ్
- నిరాహారదీక్షకు దిగిన విద్యార్థులు.. మద్దతుగా ఆందోళన
- ఆందోళనకు మద్దతు తెలిపన కాక్రోచ్ నేత అభిజిత్ దీప్కే



**రాంచీ, ఆగస్ట్ 3 :** నీట్ పేపర్ లీక్ నిరసనలతో కొన్నిరోజుల క్రితం దేశ రాజధాని దిల్లీ ఉద్రిక్తంగా మారగా.. ఇప్పుడు ఝార్ఖండ్‌లో అదే పరిస్థితి కనిపిస్తోంది. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రిలిమినరీ పరీక్షలో అవకతవకలు చోటుచేసుకున్నాయని రాజధాని నగరం రాంచీలో ప్రారంభమైన ఆందోళనలు ఉద్ధృతంగా మారాయి. నియామక పరీక్షను రద్దు చేయాలని, ఆ ఆరోపణలపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని, నియామక వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ విద్యార్థి నాయకుడు దేవేంద్రనాథ్ మహతో ఆదివారం జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ ఆందోళనలకు కాక్రోచ్ జనతాపార్టీ మద్దతు ప్రకటించింది. జేపీఎస్సీ పరీక్ష ఫలితాలు గతనెల విడుదలయ్యాయి. తర్వాత ముఖ్యమంత్రిని కలిసి, పేపర్ లీక్‌పై ఆధారాలను సమర్పించాం. కొన్నివారాలుగా నిరసనలు జరుగుతున్నా.. విద్యార్థుల ఆందోళనలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం, జేపీఎస్సీ తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. దాంతో విద్యార్థులు నిరుత్సాహానికి గురవుతున్నారు. వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు, మా పోరాటాన్ని ఉద్ధృతం చేసేందుకు నిరాహార దీక్ష ప్రారంభిస్తున్నాను. నిందితులకు శిక్ష పడటమే మా ప్రధాన లక్ష్యం అని స్టేడియంలోని ఆందోళనకారులను ఉద్దేశించి మహతో మాట్లాడారు. పేపర్ లీక్ ఆరోపణలు, నియామక పక్రియలో అవకతవకలు, పాలనాపరమైన లోపాలతో తమ కెరీర్‌కు తీవ్ర–నష్టం వాటిల్లుతోందంటూ ఆ రాష్ట్రంలోని విద్యార్థులు కొన్ని వారాల క్రితం నిరసనలు ప్రారంభించారు. జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ సీజీఎల్ పరీక్షలకు సంబంధించి ఓఎంఆర్ షీట్ వైరల్ అయిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని ఆందోళనకారులు విమర్శించారు. ఈ పరీక్షల విషయంలో సంస్థాగత మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. వీరికి సీజేపీ మద్దతు ప్రకటించింది. నిరసనకారులతో మాట్లాడాం. వారికి మేం అండగా ఉంటాం. వారి డిమాండ్లకు మా మద్దతు ఉంటుందని అభిజీత్ దీప్కే ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రిలిమినరీ పరీక్షలో పేపర్ లీకైనట్టు ఆరోపణలు రావడంతో అక్కడి విద్యార్థులు గత కొన్ని రోజులుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కాక్రోచ్ జనతా పార్టీ తాజాగా ఝార్ఖండ్ విద్యార్థులకు మద్దతు ప్రకటించింది. దేశరాజధాని రాంచీలో ప్రస్తుతం విద్యార్థుల నిరసనలు మిన్నంటాయి. పేపర్ లీక్ ఉదంతంపై దర్యాప్తు జరపాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియం వద్ద విద్యార్థులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. విద్యార్థి నాయకుడు దేవేంద్రనాథ్ మహతో ఆదివారం ఆమరణ దీక్ష ప్రారంభించారు. వారాల తరబడి నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు తీసుకోవడంలో విఫలమైందని మహతో ఆరోపించారు. కమిషన్, ప్రభుత్వం తీరుతో విద్యార్థుల మనోవేదనకు గురవుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి తమ డిమాండ్స్‌కు ఆమోదం తెలిపే వరకూ తన దీక్ష కొనసాగుతుందని చెప్పారు. ఇటీవల జరిగిన ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేయాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలో టీడీపీఎల్ ద్వారా జరిగిన పరీక్షలను సమీక్షించాలని డిమాండ్ చేశారు. ఎగ్జామ్‌లోనైనా పేపర్ లీక్ జరుగుతూనే ఉందని ఒక విద్యార్థులు మండిపడ్డారు. ఈ విషయాలపై సీఎం హేమంత్ సోరెన్ తమతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

# మహిళా రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల కేసు

**బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టులో ఊరట**

**ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించిన ఢిల్లీ కోర్టు**



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 3 :** మహిళా రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు, బీజేపీ మాజీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టులో ఊరట దక్కింది. ఈ కేసులో ఆయనను నిర్దోషిగా ప్రకటిస్తూ రౌజ్ అవెన్యూ కోర్టు అదనపు ప్రధాన న్యాయమూర్తి అశ్విని పన్వార్ సోమవారం తీర్పు వెలువరించారు. ఈ కేసులో మరో నిందితుడైన డబ్ల్యూఎఫ్ఐ మాజీ సహాయ కార్యదర్శి వినోద్ తోమర్‌ను కూడా కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడం, బాధితులు ఇచ్చిన వాంగ్మూలాల్లో వ్యత్యాసం కారణంగా కోర్టు ఈ కేసును కొట్టేసింది. ఆరుగురు మహిళా రెజ్లర్లు చేసిన ఫిర్యాదుల ఆధారంగా బ్రిజ్‌భూషణ్‌పై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం 2023 జూన్ 15న మహిళల గౌరవానికి భంగం కలిగించడం, లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడినట్లు పలు సెక్షన్ల కింద ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. 2024 మే 10న ట్రయల్ కోర్టు ఐదుగురు మహిళా రెజ్లర్లకు సంబంధించిన ఆరోపణలపై బ్రిజ్‌భూషణ్‌పై అభియోగాలు నమోదు చేసింది. ఇద్దరు రెజ్లర్లను బెదిరించిన ఆరోపణలపైనా విచారణ కొనసాగింది. అలాగే ఒక మైనర్ రెజ్లర్ కూడా ఆరోపణలు చేసినప్పటికీ, అనంతరం ఆమె ఫిర్యాదును ఉపసంహరించుకోవడంతో పోక్సో చట్టం కింద నమోదైన కేసును పోలీసులు రద్దు చేశారు. తాజా తీర్పుతో బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్, వినోద్ తోమర్ ఇద్దరూ ఈ కేసులో నిర్దోషులుగా విడుదలయ్యారు. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడం, బాధితులు ఇచ్చిన వాంగ్మూలాల్లో వ్యత్యాసం కారణంగా కోర్టు ఈ కేసును కొట్టివేసింది.2016–2019 మధ్యకాలంలో తాము లైంగిక వేధింపులు ఎదుర్కొన్నామంటూ 2023లో మహిళా రెజర్లు దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసనలు చేపట్టడం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనమైంది. నాటి సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ , ఇతర సభ్యులపై వారు ఈ ఆరోపణలు చేశారు. ఈ నిరసనల్లో స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, సాక్షి మాలిక్, బజరంగ్ పునియా తదితరులు పాల్గొన్నారు. కేంద్రం జోక్యంతో వారు మధ్యలో నిరసనలు విరమించారు. అయితే తగిన చర్యలు తీసుకోవట్లేదని ఆరోపిస్తూ ఆరుగురు రెజ్లర్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. మరోసారి నిరసనలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా పార్లమెంట్ కొత్త భవనంవైపు మార్చ్ చేపట్టగా.. వారిని పోలీసులు అడ్డుకోవడం, వారిని ఈడ్చుకెళ్లిన దృశ్యాలు వైరల్ అయ్యాయి. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ కూడా తీవ్రంగా స్పందించింది. ఆరుగురు మహిళా రెజ్లర్లు చేసిన ఫిర్యాదు ఆధారంగా బ్రిజ్‌భూషణ్‌పై కేసు నమోదైంది. పోలీసులు అభియోగాలు దాఖలు చేశారు. ఆ ఆరుగురిలో వినేశ్ ఫొగాట్ కూడా ఉన్నారు. ఆ విషయాన్ని మూడు నెలల క్రితం ఆమె వెల్లడించారు. లైంగిక వేధింపుల బాధితుల గుర్తింపును పరిరక్షించేలా సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఇంతకాలం తన గుర్తింపును బయటపెట్టలేదని వెల్లడించారు. అంతకుముందు మైనర్ రెజ్లర్ ఒకరు తాను చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకోవడంతో పోక్సో కేసులో సింగ్ ఇప్పటికే నిర్దోషిగా తేలారు. ఇక నేటి తీర్పుతో ఆయనపై క్రిమినల్ విచారణ ముగిసినట్లయింది. తొలినుంచి బ్రిజ్ భూషణ్ తనపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చారు. ఆ ఆరోపణలు నిజమని తేలితే.. నేను ఉరివేసుకుంటానని తొలిరోజే చెప్పాను. నేడు నేను నిర్దోషిగా తేలినందుకు ఎంతోసంతోషంగా ఉందని తీర్పు అనంతరం సింగ్ వ్యాఖ్యానించారు.

## ఎన్‌కౌంటర్‌లో కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ హతం

**తుపాకీ లాక్కుని పారిపోతుండగా కాల్పులు**

**రాంచీ, ఆగస్ట్ 3 :** ఝార్ఖండ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ హతమయ్యాడు. పోలీసుల తుపాకీ లాక్కుని పారిపోతుండగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో గ్యాంగ్‌స్టర్ సుజిత్ సిన్హా మరణించాడని పోలీసులు తెలిపారు. సాహిబ్‌గంజ్ డివిజనల్ జైలుకు అతడిని తరలిస్తుండగా శనివారం రాత్రి ఈ ఘటన జరిగిందని చెప్పారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ధన్‌బాద్ జైలు నుంచి సాహిబ్‌గంజ్ మండల్ జైలుకు తరలిస్తుండగా సాహిబ్‌గంజ్ హైవేపై ఈ ఘటన జరిగింది. నాలుగు పోలీసు వాహనాల ఎస్కార్ట్‌తో అతడిని పోలీసులు తరలించారు. అయితే, జమ్‌తారా పోలీస్ స్టేషన్ పరిధిలోకి కాన్వాయ్ వచ్చేసరికి తాను మరుగుదొడ్డికి వెళ్లాలని అతడు కోరాడు. వాహనాలు ఆపిన సమయంలో అతడు తుపాకీ లాక్కుని చీకట్లోకి పారిపోయేందుకు ప్రయత్నించాడని పోలీసులు తెలిపారు. తమపై కాల్పులు కూడా జరిపాడని అన్నారు. స్వీయ రక్షణ కోసం తాము కాల్పులు జరపాల్సి వచ్చిందని చెప్పారు. అతడు ఘటనా స్థలంలోనే మరణించినట్టు అక్కడికి వచ్చిన మెడికల్ టీమ్ ప్రకటించింది. జమ్‌తారా ఎస్పీ శంభు కుమార్ సింగ్ ఆధ్వర్యంలో ఈ ఉదంతంపై దర్యాప్తు కొనసాగుతోంది. ఝార్ఖండ్‌లో సిన్హాపై అనేక కేసులు ఉన్నాయి. బలవంతపు వసూళ్లు, హత్య, హత్యాయత్నం తదితర కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. రాష్ట్రంలో తన ఇన్‌ఫ్లుయెన్స్‌ను కొనసాగించేందుకు పలు గ్యాంగులతో జట్లు కట్టి నెట్‌వర్క్‌ను నిర్మించుకున్నాడని పోలీసులు తెలిపారు.



## నిజామబాద్ జిల్లాలో ఆస్పత్రుల అభివృద్ధి

**మంత్రి దామోదర రాజనర్సింహ**

**హైదరాబాద్,ఆగస్ట్3 :** నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల మౌలిక వసతుల అభివృద్ధి, కొత్త భవనాల నిర్మాణం, వైద్య పరికరాల అందుబాటు, అవసరమైన సిబ్బంది నియామకం, పెండింగ్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉండే వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. నిజామాబాద్ ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. నిజామాబాద్ జిల్లాలో ఆరోగ్య సేవల పనితీరుపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సచివాలయంలో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులతో పాటు జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీ, జనరల్ ఆస్పత్రి పనితీరు, రోగులకు అందుతున్న వైద్య సేవలు సహా సిబ్బంది అందుబాటు, అత్యవసర సేవల నిర్వహణ వంటి అంశాలపై మంత్రి విస్తృతంగా చర్చించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు), కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు(సీహెచ్‌సీలు), సబ్ సెంటర్ల ద్వారా ప్రజలకు అందుతున్న సేవల నాణ్యత, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల విస్తరణపై అధికారులను ప్రశ్నించి అవసరమైన సూచనలు చేశారు. ఆరోగ్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా అధికారులు కృషి చేయాలని ఆయన స్పష్టం చేశారు.



## లాల్‌దర్వాజ బోనాలకు అన్ని ఏర్పాట్లు

- జోగినిలకు ప్రత్యేక గుర్తింపు కార్డులు
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

**హైదరాబాద్,ఆగస్ట్3 :** లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటనలు చేశారు. జోగినిలకు ప్రత్యేక గుర్తింపు, గుర్తింపు కార్డుల జారీతో పాటు భవిష్యత్తులో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ రోజు తెలంగాణ ప్రజలందరికీ శుభదినమని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల జాతర కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఈసారి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కొంత ఒత్తిడి ఏర్పడినా, దర్శనాలు సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేశారని చెప్పారు. జోగినిలకు ప్రత్యేక గుర్తింపు కల్పించాలని వారు కోరిన విషయాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో జోగినిలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, వారికి గుర్తింపు కార్డులు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. అలాగే మున్సిపల్ ఎన్నికల్లో వారిని కో–ఆప్షన్ సభ్యులుగా తీసుకునే దిశగా కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. అమ్మవారికి సేవ చేసే వారికి మూడు శాఖల సమన్వయంతో లాల్‌దర్వాజా బోనాల సందర్భంగా మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తామని, జోగినిలకు అధికారిక గుర్తింపు కల్పించే అంశంపై సంబంధిత మంత్రితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## మహంకాళి ఆలయం వద్ద జోగినిలకు అవమానం

- జోగినిలను అడ్డుకోవడంపై ఆలయం ముందు ఆందోళన
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై మండిపడ్డ జోగిని శ్యామల

**హైదరాబాద్,ఆగస్ట్3 :** ఉజ్జయిని మహంకాళి ఆలయంలో అధికారుల నిర్లక్ష్యంపై జోగిని శ్యామల ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరం వచ్చినప్పుడే జోగినిలను ప్రభుత్వం గుర్తు చేసుకుంటుందని ధ్వజమెత్తారు. బోనాల సందర్భంగా జోగినిలకు కనీస ఏర్పాట్లు కూడా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఆలయ సిబ్బంది జోగినిలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల అత్యుత్సాహం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని జోగిని శ్యామల ఆగ్రహించారు. ఉదయం నుంచే గేట్ల వద్ద పోలీసులు జోగినిలను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా జోగినిలను అవమానించారని దుయ్యబట్టారు. ఆలయ కమిటీ జోగినిలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు కనీసం జోగినిలని అని కూడా చూడకుండా బయటకు ఎందుకు నెట్టేశారని ప్రశ్నించారు. జోగినిలకు గౌరవం, ప్రత్యేక ఏర్పాట్లు కల్పించాలని ప్రభుత్వాన్ని జోగిని శ్యామల కోరారు. ఈ క్రమంలో ఉజ్జయిని మహంకాళి ఆలయం ముందు జోగినిలు సోమవారం ధర్నా చేపట్టారు. ఆదివారం బోనాల వేడుకల్లో జోగినిలను అవమానపరిచారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే జోగిని శ్యామలను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు జోగినిలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. బ్యారికేడ్లు తొలగించుకుని మహంకాళి ఆలయంలోకి జోగినిలు ప్రవేశించారు. మహంకాళి ఆలయం ముందు జోగినిల ఆందోళనతో ఆలస్యంగా రంగం కార్యక్రమం ప్రారంభమైంది. జోగినిల ఆందోళనతో అమ్మవారి ఆలయం ముందు గందరగోళ వాతావరణం నెలకొంది. జోగినిలను చర్చలకు పిలిచి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండోమెంట్ ఉన్నతాధికారులు మాట్లాడారు. ఆందోళనను విరమించాలని జోగినిలను మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

# హామీలను మోసగిస్తున్న పాలకులు!



**తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తోంది. ప్రధాన సమస్యలపై ఇప్పటికీ స్పష్టత లేకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. ముఖ్యంగా ధరణి విషయంలో ఎన్నో చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పటికీ దీనిపై స్పష్టత లేదు. ఎన్ని భూములు అన్యాకాంత్రం అయ్యాయో తెలియదు. దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్య తీసుకోలేదు. దేవాదాయ భూములు తెలంగాణలో వేల ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయి. కొందరు దౌర్జన్యంగా అవి పట్టాలు చేయించుకుని, రైతుభరోసా కూడా పొందుతున్నారు. ఈ భూములను స్వాధీనం చేసుకోవడంలో గత కెసిఆర్ ప్రభుత్వం, రేవంత్ ప్రభుత్వం కూడా విఫలమయ్యింది. మంత్రి కొండా సురేఖ ఉత్సవ విగ్రహంలా తయారయ్యారన్న విమర్శలు ఉన్నాయి. ఎపిలో కూడా ఇలాంటి భూములపై చంద్రబాబు ఒక్కమాటా మాట్లాడడం లేదు.**

ఇకపోతే కాలేశ్వరంపై విమర్శలు తప్ప ఉన్న ప్రాజెక్టును ఉపయోగించుకునే ఆలోచన చేయడంలేదు. జర్నలిస్టుల అక్రిడిటేషన్లపై గందరోగళం జరుగుతోంది. దీనిని సజావుగా పరిష్కరించడం లేదు. కోర్టుల్లో కేసులు కూడా దాఖలు అయ్యాయి. జర్నలిస్టులు ఇంటిస్థలాలు, ఆరోగ్య కార్డులు ఊసే లేదు. ఇప్పటికే ఉమ్మడి ఎపిలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి కేటాయించిన 70 ఎకరాల భూమిని కాజేసే కుట్రలు మొదలయ్యాయి. సుప్రీంకోర్టు తీర్పును బూచిగా చూపి, వేలకోట్ల విలువ చేసే భూమిని లాగేసుకుని, జర్నలిస్టులకు మొడిచేయి చూపేందుకు రంగం సిద్దం చేశారు. ఇందులో కొందరు జర్నలిస్టుల పాత్రకూడా ఉంది. జర్నలిస్టులకు అన్యాయం చేయడంలో టిడిపి ప్రభుత్వం, జగన్ ప్రభుత్వం కూడా ఎపిలో ఇదే తరహా పోకడలు సాగించింది. ఇక అన్నింటికన్నా పెద్ద సమస్య నిరుద్యోగ సమస్య. మొన్నటికి మొన్న ఢిల్లీలో కాక్రోచ్ జనతాపార్టీ ఆందోళనలకు మద్దతు తెలిపిన రాహుల్, రేవంత్ రెడ్డిలు తెలంగాణ నిరుద్యోగుల ఆందోళనలకు మాత్రం సమాధానం చెప్పడం లేదు. ఇక్కడా అలాంటి ఉద్యమం వస్తే తప్ప వీరు స్పందించేలా లేరు. క్యాలెండర్లు మారాయి కానీ కొలువులు మాత్రం రావడలేదని ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. తెలంగాణలో ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలిస్తానన్న కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు దాటినా నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. ఇటీవలే సిఎం రేవంత్ 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. అంటే ఆయన ఇచ్చిన హామీని ఆయనే నెరవేర్చలేదని చెబుతున్నారు.

అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు రెండేండ్లు పూర్తయినా.. నోటిఫికేషన్లు విడుదల చేయలేదు. నోటిఫికేషన్లపై మాట తప్పిన సర్కార్ మీద నిరుద్యోగులు ఆగ్రహంగా ఉన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్.. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ.. నాలుగువేల రూపాయల చొప్పున నిరుద్యోగ భృతి.. ఇదీ కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ. కానీ, అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను విస్మరించింది. జాబ్ క్యాలెండర్ జాడ లేదు. నిరుద్యోగ భృతి ఊసులేదు. 'ఇదిగో మా నిబద్ధత..' అంటూ 2024 ఆగస్టు 2న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్‌ను ప్రవేశపెట్టారు. 15 రకాల నోటిఫికేషన్లు ఇస్తామని చెప్పారు. ఈ క్యాలెండర్ గడువు కూడా ముగిసింది. కానీ, అందులో పేర్కొన్న ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల కాలేదు. 2025 ఆగస్టు 2,శనివారంతో 2026 ఆగస్టు 2 కూడా గడిచిపోయింది.రెండేండ్ల గడువు పూర్తయ్యింది. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు విలువ లేకుండా పోయింది. నిరుద్యోగ యువతను తమవైపు తిప్పుకొనేం దుకు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్ ప్రకటించింది. దీనిని ఎన్నికల మ్యానిఫెస్టోలో సైతం పొందుపరిచింది. కానీ, డిక్లరేషన్‌లో ప్రకటించిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. ఉద్యోగాలొచ్చే వరకు యువతకు నెలకు రూ. 4వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని కూడా కాంగ్రెస్ నేతలు మరచిపోయారు. అమ్మాయిలకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తామన్న హామీని కూడా నెరవేర్చలేదు. రూ.5 లక్షల విద్యాభరోసా కార్డు, రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామన్న హామీని పట్టించుకోలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఏటా దాదాపు 9వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్ అవుతున్నట్లు అంచనాలు ఉన్నాయి. వీరితోపాటు విద్యుత్తు సంస్థలు, పలు బోర్డులు, విభాగాల్లోనూ పెద్దఎత్తున ఉద్యోగ విరమణ పొందుతున్నారు. తాజా గణాంకాల ప్రకారం పాఠశాల విద్యాశాఖలో 14వేలకుపైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అంటున్నారు. యూనివర్సిటీల్లో 2వేలకుపైగా బోధన, మరో 2,800 బోధనేతర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గురుకులాల్లో ఆరువేలు, ఆర్టీసీలో మూడువేలకుపైగా, పోలీసుశాఖలో 17వేలకుపైగా ఖాళీలున్నాయి. ఎక్సైజ్ శాఖలో వెయ్యి, అంగన్‌వాడీల్లో 15వేలకుపైగా, మైనారిటీ సంక్షేమ శాఖలో మూడువేలకుపైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఇలా పలు శాఖల్లో పెద్దఎత్తున ఖాళీలున్నా సర్కార్ నోటిఫికేషన్లు విడుదల చేయడంలేదన్న ఆందోళన నిరుద్యోగుల్లో ఉంది. మరోవైపు రాష్ట్రంలో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉండటం గమనార్హం. మూడు లక్షల మంది రెగ్యులర్ ఉద్యోగులుంటే అంతే స్థాయిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. దీనికి గత కెసిఆర్ ప్రభుత్వం ప్రధాన దోషిగా ప్రకటించాలి. ఇంటికో ఉద్యోగం అంటూ మోసం చేసి, అలా అనలేదని బుకాయించారు. లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెట్టుమీద ఆకులతో ఇస్తార్లు కుట్టినట్లు లెక్కలు చెప్పారు. ఏతావాతా ఎవరు అధికారంలోకి వచ్చినా తమ స్వప్రయోజనాలు తప్ప ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని తేల్చారు. అలు కెసిఆర్, రేవంత్, చంద్రబాబు, జగన్ ఎవరైనా ప్రజలు మాటలతో బురిడీ కొట్టించడంలో ఆరితేరారు.

# జార్ఖండ్‌లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీక్

- సమగ్ర విచారణ జరపాలంటూ విద్యార్థుల డిమాండ్
- నిరాహారదీక్షకు దిగిన విద్యార్థులు.. మద్దతుగా ఆందోళన
- ఆందోళనకు మద్దతు తెలిపన కాక్రోచ్ నేత అభిజిత్ దీప్కే



**రాంచీ, ఆగస్టు 3 :** నీట్ పేపర్ లీక్ నిరసనలతో కొన్నిరోజుల క్రితం దేశ రాజధాని దిల్లీ ఉద్రిక్తంగా మారగా.. ఇప్పుడు ఝార్ఖండ్‌లో అదే పరిస్థితి కనిపిస్తోంది. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రిలిమినరీ పరీక్షలో అవకతవకలు చోటుచేసుకున్నాయని రాజధాని నగరం రాంచీలో ప్రారంభమైన ఆందోళనలు ఉద్ధృతంగా మారాయి. నియామక పరీక్షను రద్దు చేయాలని, ఆ ఆరోపణలపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని, నియామక వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ విద్యార్థి నాయకుడు దేవేంద్రనాథ్ మహతో ఆదివారం జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ ఆందోళనలకు కాక్రోచ్ జనతాపార్టీ మద్దతు ప్రకటించింది. జేపీఎస్‌సీ పరీక్ష ఫలితాలు గతనెల విడుదలయ్యాయి. తర్వాత ముఖ్యమంత్రిని కలిసి, పేపర్ లీక్‌పై ఆధారాలను సమర్పించాం. కొన్నివారాలుగా నిరసనలు జరుగుతున్నా.. విద్యార్థుల ఆందోళనలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం, జేపీఎస్‌సీ తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. దాంతో విద్యార్థులు నిరుత్సాహానికి గురవుతున్నారు. వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు, మా పోరాటాన్ని ఉద్ధృతం చేసేందుకు నిరాహార దీక్ష ప్రారంభిస్తున్నాను. నిందితులకు శిక్ష పడటమే మా ప్రధాన లక్ష్యం అని స్టేడియంలోని ఆందోళనకారులను ఉద్దేశించి మహతో మాట్లాడారు. పేపర్ లీక్ ఆరోపణలు, నియామక ప్రక్రియలో అవకతవకలు, పాలనాపరమైన లోపాలతో తమ కెరీర్‌కు తీవ్ర-నష్టం వాటిల్లుతోందంటూ ఆ రాష్ట్రంలోని విద్యార్థులు కొన్ని వారాల క్రితం నిరసనలు ప్రారంభించారు. జేపీఎస్‌సీ, జేఎస్ఎస్‌సీ సీజీఎల్ పరీక్షలకు సంబంధించి ఓఎంఆర్ షీట్ వైరల్ అయిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని ఆందోళనకారులు విమర్శించారు. ఈ పరీక్షల విషయంలో సంస్థాగత మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. వీరికి సీజేపీ మద్దతు ప్రకటించింది. నిరసనకారులతో మాట్లాడాం. వారికి మేం అండగా ఉంటాం. వారి డిమాండ్లకు మా మద్దతు ఉంటుందని అభిజీత్ దీప్కే ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రిలిమినరీ పరీక్షలో పేపర్ లీకైనట్టు ఆరోపణలు రావడంతో అక్కడి విద్యార్థులు గత కొన్ని రోజులుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కాక్రోచ్ జనతా పార్టీ తాజాగా ఝార్ఖండ్ విద్యార్థులకు మద్దతు ప్రకటించింది. దేశరాజధాని రాంచీలో ప్రస్తుతం విద్యార్థుల నిరసనలు మిన్నంటాయి. పేపర్ లీక్ ఉదంతంపై దర్యాప్తు జరపాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియం వద్ద విద్యార్థులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. విద్యార్థి నాయకుడు దేవేంద్ర నాథ్ మహాతో ఆదివారం ఆమరణ దీక్ష ప్రారంభించారు. వారాల తరబడి నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు తీసుకోవడంలో విఫలమైందని మహాతో ఆరోపించారు. కమిషన్, ప్రభుత్వం తీరుతో విద్యార్థుల మనోవేదనకు గురవుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి తమ డిమాండ్స్‌కు ఆమోదం తెలిపే వరకూ తన దీక్ష కొనసాగుతుందని చెప్పారు. ఇటీవల జరిగిన ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేయాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలో టీడీపీఎల్ ద్వారా జరిగిన పరీక్షలను సమీక్షించాలని డిమాండ్ చేశారు. ఎగ్జామ్‌లోనైనా పేపర్ లీక్ జరుగుతూనే ఉందని ఒక విద్యార్థులు మండిపడ్డారు. ఈ విషయాలపై సీఎం హేమంత్ సోరెన్ తమతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

# మహిళా రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల కేసు

**బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టులో ఊరట**

**ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించిన ఢిల్లీ కోర్టు**



**న్యూఢిల్లీ, ఆగస్టు 3 :** మహిళా రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) మాజీ అధ్యక్షుడు, బీజేపీ మాజీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టులో ఊరట దక్కింది. ఈ కేసులో ఆయనను నిర్దోషిగా ప్రకటిస్తూ రౌజ్ అవెన్యూ కోర్టు అదనపు ప్రధాన న్యాయమూర్తి అశ్విని పన్వార్ సోమవారం తీర్పు వెలువరించారు. ఈ కేసులో మరో నిందితుడైన డబ్ల్యూఎఫ్‌ఐ మాజీ సహాయ కార్యదర్శి వినోద్ తోమర్‌ను కూడా కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడం, బాధితులు ఇచ్చిన వాంగ్మూలాల్లో వ్యత్యాసం కారణంగా కోర్టు ఈ కేసును కొట్టేసింది. ఆరుగురు మహిళా రెజ్లర్లు చేసిన ఫిర్యాదుల ఆధారంగా బ్రిజ్‌భూషణ్‌పై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం 2023 జూన్ 15న మహిళల గౌరవానికి భంగం కలిగించడం, లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడినట్లు పలు సెక్షన్ల కింద ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. 2024 మే 10న ట్రయల్ కోర్టు ఐదుగురు మహిళా రెజ్లర్లకు సంబంధించిన ఆరోపణలపై బ్రిజ్‌భూషణ్‌పై అభియోగాలు నమోదు చేసింది. ఇద్దరు రెజ్లర్లను బెదిరించిన ఆరోపణలపైనా విచారణ కొనసాగింది. అలాగే ఒక మైనర్ రెజ్లర్ కూడా ఆరోపణలు చేసినప్పటికీ, అనంతరం ఆమె ఫిర్యాదును ఉపసంహరించుకోవడంతో పోక్సో చట్టం కింద నమోదైన కేసును పోలీసులు రద్దు చేశారు. తాజా తీర్పుతో బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్, వినోద్ తోమర్ ఇద్దరూ ఈ కేసులో నిర్దోషులుగా విడుదలయ్యారు. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడం, బాధితులు ఇచ్చిన వాంగ్మూలాల్లో వ్యత్యాసం కారణంగా కోర్టు ఈ కేసును కొట్టివేసింది. 2016-2019 మధ్యకాలంలో తాము లైంగిక వేధింపులు ఎదుర్కొన్నామంటూ 2023లో మహిళా రెజర్లు దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసనలు చేపట్టడం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనమైంది. నాటి సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ , ఇతర సభ్యులపై వారు ఈ ఆరోపణలు చేశారు. ఈ నిరసనల్లో స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, సాక్షి మాలిక్, బజరంగ్ పునియా తదితరులు పాల్గొన్నారు. కేంద్రం జోక్యంతో వారు మధ్యలో నిరసనలు విరమించారు. అయితే తగిన చర్యలు తీసుకోవట్లేదని ఆరోపిస్తూ ఆరుగురు రెజ్లర్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. మరోసారి నిరసనలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా పార్లమెంట్ కొత్త భవనంవైపు మార్చ్ చేపట్టగా.. వారిని పోలీసులు అడ్డుకోవడం, వారిని ఈడ్చుకెళ్లిన దృశ్యాలు వైరల్ అయ్యాయి. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ కూడా తీవ్రంగా స్పందించింది. ఆరుగురు మహిళా రెజ్లర్లు చేసిన ఫిర్యాదు ఆధారంగా బ్రిజ్‌భూషణ్‌పై కేసు నమోదైంది. పోలీసులు అభియోగాలు దాఖలు చేశారు. ఆ ఆరుగురిలో వినేశ్ ఫొగాట్ కూడా ఉన్నారు. ఆ విషయాన్ని మూడు నెలల క్రితం ఆమె వెల్లడించారు. లైంగిక వేధింపుల బాధితుల గుర్తింపును పరిరక్షించేలా సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఇంతకాలం తన గుర్తింపును బయటపెట్టలేదని వెల్లడించారు. అంతకుముందు మైనర్ రెజ్లర్ ఒకరు తాను చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకోవడంతో పోక్సో కేసులో సింగ్ ఇప్పటికే నిర్దోషిగా తేలారు. ఇక నేటి తీర్పుతో ఆయనపై క్రిమినల్ విచారణ ముగిసినట్లయింది. తొలినుంచి బ్రిజ్ భూషణ్ తనపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చారు. ఆ ఆరోపణలు నిజమని తేలితే.. నేను ఉరివేసుకుంటానని తొలిరోజే చెప్పాను. నేడు నేను నిర్దోషిగా తేలినందుకు ఎంతోసంతోషంగా ఉందని తీర్పు అనంతరం సింగ్ వ్యాఖ్యానించారు.

## ఎన్‌కౌంటర్‌లో కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ హతం

**తుపాకీ లాక్కుని పారిపోతుండగా కాల్పులు**

**రాంచీ, ఆగస్టు 3 :** ఝార్ఖండ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ హతమయ్యాడు. పోలీసుల తుపాకీ లాక్కుని పారిపోతుండగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో గ్యాంగ్‌స్టర్ సుజిత్ సిన్హా మరణించాడని పోలీసులు తెలిపారు. సాహిబ్‌గంజ్ డివిజనల్ జైలుకు అతడిని తరలిస్తుండగా శనివారం రాత్రి ఈ ఘటన జరిగిందని చెప్పారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ధన్‌బాద్ జైలు నుంచి సాహిబ్‌గంజ్ మండల్ జైలుకు తరలిస్తుండగా సాహిబ్‌గంజ్ హైవేపై ఈ ఘటన జరిగింది. నాలుగు పోలీసు వాహనాల ఎస్కార్ట్‌తో అతడిని పోలీసులు తరలించారు. అయితే, జమ్‌తారా పోలీస్ స్టేషన్ పరిధిలోకి కాన్వాయ్ వచ్చేసరికి తాను మరుగుదొడ్డికి వెళ్లాలని అతడు కోరాడు. వాహనాలు ఆపిన సమయంలో అతడు తుపాకీ లాక్కుని చీకట్లోకి పారిపోయేందుకు ప్రయత్నించాడని పోలీసులు తెలిపారు. తమపై కాల్పులు కూడా జరిపాడని అన్నారు. స్వీయ రక్షణ కోసం తాము కాల్పులు జరపాల్సి వచ్చిందని చెప్పారు. అతడు ఘటనా స్థలంలోనే మరణించినట్టు అక్కడికి వచ్చిన మెడికల్ టీమ్ ప్రకటించింది. జమ్‌తారా ఎస్పీ శంభు కుమార్ సింగ్ ఆధ్వర్యంలో ఈ ఉదంతంపై దర్యాప్తు కొనసాగుతోంది. ఝార్ఖండ్‌లో సిన్హాపై అనేక కేసులు ఉన్నాయి. బలవంతపు వసూళ్లు, హత్య, హత్యాయత్నం తదితర కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. రాష్ట్రంలో తన ఇన్‌ఫ్లుయెన్స్‌ను కొనసాగించేందుకు పలు గ్యాంగులతో జట్లు కట్టి నెట్‌వర్క్‌ను నిర్మించుకున్నాడని పోలీసులు తెలిపారు.



## నిజామబాద్ జిల్లాలో ఆస్పత్రుల అభివృద్ధి

**మంత్రి దామోదర రాజనర్సింహ**

**హైదరాబాద్,ఆగస్ట్3 :** నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల మౌలిక వసతుల అభివృద్ధి, కొత్త భవనాల నిర్మాణం, వైద్య పరికరాల అందుబాటు, అవసరమైన సిబ్బంది నియామకం, పెండింగ్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉండే వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. నిజామాబాద్ ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. నిజామాబాద్ జిల్లాలో ఆరోగ్య సేవల పనితీరుపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సచివాలయంలో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులతో పాటు జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీ, జనరల్ ఆస్పత్రి పనితీరు, రోగులకు అందుతున్న వైద్య సేవలు సహా సిబ్బంది అందుబాటు, అత్యవసర సేవల నిర్వహణ వంటి అంశాలపై మంత్రి విస్తృతంగా చర్చించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు), కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు(సీహెచ్‌సీలు), సబ్ సెంటర్ల ద్వారా ప్రజలకు అందుతున్న సేవల నాణ్యత, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల విస్తరణపై అధికారులను ప్రశ్నించి అవసరమైన సూచనలు చేశారు. ఆరోగ్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా అధికారులు కృషి చేయాలని ఆయన స్పష్టం చేశారు.



## లాల్‌దర్వాజ బోనాలకు అన్ని ఏర్పాట్లు

- జోగినిలకు ప్రత్యేక గుర్తింపు కార్డులు
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

**హైదరాబాద్,ఆగస్ట్3 :** లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటనలు చేశారు. జోగినిలకు ప్రత్యేక గుర్తింపు, గుర్తింపు కార్డుల జారీతో పాటు భవిష్యత్తులో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ రోజు తెలంగాణ ప్రజలందరికీ శుభదినమని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల జాతర కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఈసారి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కొంత ఒత్తిడి ఏర్పడినా, దర్శనాలు సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేశారని చెప్పారు. జోగినిలకు ప్రత్యేక గుర్తింపు కల్పించాలని వారు కోరిన విషయాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో జోగినిలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, వారికి గుర్తింపు కార్డులు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. అలాగే మున్సిపల్ ఎన్నికల్లో వారిని కో-ఆప్షన్ సభ్యులుగా తీసుకునే దిశగా కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. అమ్మవారికి సేవ చేసే వారికి మూడు శాఖల సమన్వయంతో లాల్‌దర్వాజా బోనాల సందర్భంగా మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తామని, జోగినిలకు అధికారిక గుర్తింపు కల్పించే అంశంపై సంబంధిత మంత్రితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## మహంకాళి ఆలయం వద్ద జోగినిలకు అవమానం

- జోగినిలను అడ్డుకోవడంపై ఆలయం ముందు ఆందోళన
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై మండిపడ్డ జోగిని శ్యామల

**హైదరాబాద్,ఆగస్ట్3 :** ఉజ్జయిని మహంకాళి ఆలయంలో అధికారుల నిర్లక్ష్యంపై జోగిని శ్యామల ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరం వచ్చినప్పుడే జోగినిలను ప్రభుత్వం గుర్తు చేసుకుంటుందని ధ్వజమెత్తారు. బోనాల సందర్భంగా జోగినిలకు కనీస ఏర్పాట్లు కూడా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఆలయ సిబ్బంది జోగినిలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల అత్యుత్సాహం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని జోగిని శ్యామల ఆగ్రహించారు. ఉదయం నుంచే గేట్ల వద్ద పోలీసులు జోగినిలను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా జోగినిలను అవమానించారని దుయ్యబట్టారు. ఆలయ కమిటీ జోగినిలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు కనీసం జోగినిలని అని కూడా చూడకుండా బయటకు ఎందుకు నెట్టేశారని ప్రశ్నించారు. జోగినిలకు గౌరవం, ప్రత్యేక ఏర్పాట్లు కల్పించాలని ప్రభుత్వాన్ని జోగిని శ్యామల కోరారు. ఈ క్రమంలో ఉజ్జయిని మహంకాళి ఆలయం ముందు జోగినిలు సోమవారం ధర్నా చేపట్టారు. ఆదివారం బోనాల వేడుకల్లో జోగినిలను అవమానపరిచారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే జోగిని శ్యామలను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు జోగినిలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. బ్యారికేడ్లు తొలగించుకుని మహంకాళి ఆలయంలోకి జోగినిలు ప్రవేశించారు. మహంకాళి ఆలయం ముందు జోగినిల ఆందోళనతో ఆలస్యంగా రంగం కార్యక్రమం ప్రారంభమైంది. జోగినిల ఆందోళనతో అమ్మవారి ఆలయం ముందు గందరగోళ వాతావరణం నెలకొంది. జోగినిలను చర్చలకు పిలిచి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండోమెంట్ ఉన్నతాధికారులు మాట్లాడారు. ఆందోళనను విరమించాలని జోగినిలను మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

# షాద్‌నగర్ చౌరస్తా విస్తరణ పనులు వెంటనే ప్రారంభించాలి

## బీసీ సేన నేత ప్యాట జయ శ్రీకాంత్ డిమాండ్



**షాద్‌నగర్ , ఆగస్టు 3(జనం వార్త) :** షాద్‌నగర్ చౌరస్తా విస్తరణ పనులను తక్షణమే తిరిగి ప్రారంభించాలని బీసీ సేన రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి, షాద్‌నగర్ నియోజకవర్గ ఇంచార్జ్ ప్యాట జయ శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో తీసుకున్న తీర్మానం మేరకు పరిగి రోడ్డు, మహబూబ్‌నగర్ రోడ్డు, హైదరాబాద్ రోడ్డులో రహదారి విస్తరణలో భాగంగా మెట్లు, డబ్బాల తొలగింపు పనులు ప్రారంభించినప్పటికీ, మూడు రోజులకే వాటిని నిలిపివేయడం ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసిందని ఆమె పేర్కొన్నారు. చిన్న వ్యాపారుల నిర్మాణాలను మాత్రమే తొలగించి, పెద్ద వ్యాపారుల ఆక్రమణలను వదిలేయడం అన్యాయమని, అందరికీ ఒకే న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. షాద్‌నగర్ చౌరస్తా ఆరు మండలాలకు ప్రధాన కూడలిగా ఉండటంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోందని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని విస్తరణ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. లేకపోతే బీసీ సేన ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తూ, చౌరస్తా విస్తరణ కోసం పోరాడుతున్న ఉద్యమకారుడు ఆర్.ఎన్. రాముకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ప్యాట జయ శ్రీకాంత్ స్పష్టం చేశారు.




# కరోనా కాలం అద్దె బకాయిలు మాఫీ చేసి.. ఎస్సీ యువతను ఆదుకోవాలి

## జిల్లా కలెక్టర్‌కు బీఎస్పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస్ వినతి

**షాద్‌నగర్ , ఆగస్టు 3(జనం వార్త) :** కరోనా మహమ్మారి కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న ఎస్సీ యువతకు ప్రభుత్వం అండగా నిలవాలని, కరోనా కాలానికి సంబంధించిన అద్దె బకాయిలను పూర్తిగా మాఫీ చేసి, అదనంగా రెండేళ్ల లీజు గడువు కల్పించాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శ్రీ నారాయణ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ ఎస్సీ యువతకు ఉపాధి కల్పించేందుకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించి దుకాణాలను కేటాయించారని తెలిపారు. అయితే 2020లో కరోనా వైరస్ వ్యాప్తి, లాక్‌డౌన్, ఆర్థిక మాంద్యం కారణంగా వ్యాపారాలు పూర్తిగా దెబ్బతినడంతో లబ్ధిదారులు అద్దెలు చెల్లించే పరిస్థితిలో లేక తీవ్ర నష్టాలను ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 2020 మార్చి 22 నుంచి 2022 మార్చి 22 వరకు ఉన్న రెండేళ్ల అద్దె బకాయిలను పూర్తిగా మాఫీ చేయడంతో పాటు, కోల్పోయిన వ్యాపార అవకాశాలను పరిగణనలోకి తీసుకొని మరో రెండేళ్ల లీజు గడువును పొడిగించాలని కలెక్టర్ ద్వారా ప్రభుత్వాన్ని కోరారు. అలాగే అద్దె బకాయిల పేరుతో ఎస్సీ కార్పొరేషన్ అధికారులు, ముఖ్యంగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కొంతమంది యువతపై పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేసి వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అద్దె చెల్లించలేక రద్దు చేసిన దుకాణాలను తిరిగి అదే లబ్ధిదారులకు కేటాయించి వారి జీవనోపాధిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

# పేకాట స్థావరంపై దాడి..

## జూదం ఆడుతున్న 9 మంది అరెస్ట్



**దుబ్బాక ప్రతినిధి ఆసరాజు ఆగస్టు 3 (జనం వార్త ) :** పేకాట స్థావరంపై దాడి చేసి, పేకాట ఆడుతున్న 9 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసిన ఘటన దుబ్బాక మండలం రాజక్కపేటలో ఆదివారం చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్ఐ కీర్తిరాజు తెలిపిన వివరాల ప్రకారం.... రాజక్కపేట గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి, పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.8150 నగదు, 5 సెల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



# సిసి రోడ్డు నిర్మాణం నాణ్యత లేని రోడ్డు మాకు వద్దు

## ప్రజలకు ఎల్లప్పుడూ ఉపయోగపడే సిసి రోడ్డు మాకు కావాలి



**దుబ్బాకప్రతినిధి ఆసరాజు ఆగస్టు 3 (జనం వార్త) :** సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రాజక్కపేట గ్రామంలో లక్షల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభమైన కొద్ది రోజులకే పలు చోట్ల పగుళ్లు రావడం స్థానికంగా చర్చనీయాంశమైంది. నిర్మాణంలో నాణ్యత లోపాలు, అధికారుల పర్యవేక్షణ కొరవడటమే ఇందుకు కారణమని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రాజక్కపేట గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డుపై ప్రారంభమైన కొద్ది రోజులకే పలు చోట్ల పగుళ్లు కనిపించాయి. కొత్తగా నిర్మించిన రోడ్డు ఇంత తక్కువ సమయంలోనే దెబ్బతినడంతో గ్రామస్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న సీసీ రోడ్డుపై వెంటనే సాంకేతిక విచారణ నిర్వహించి, పనుల్లో నాణ్యత లోపాలు ఉన్నట్లు తేలితే బాధ్యులైన కాంట్రాక్టర్‌తో పాటు సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ-స్థులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే పగుళ్లు ఏర్పడిన సీసీ రోడ్డును నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పునర్నిర్మించాలని కోరుతున్నారు.

# అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో దుబ్బాక పట్టణానికి రెండు గోల్డ్ మెడల్స్




**దుబ్బాక ప్రతినిధి ఆగస్టు 3(జనం వార్త) :** అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణ విద్యార్థులు విజేతలుగా గెలిచారని యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ వ్యవస్థాపకులు కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ సోమవారం తెలిపారు. ఆదివారం హైదరాబాద్ ఎల్బీనగర్ చంపాపేట్ లక్ష్మీ గార్డెన్ లో రెండవ అంతర్జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ కరాటే పోటీలకు ఇండియా, భూటాన్, నేపాల్ శ్రీలంక, మలేషియా దేశాలతో పాటు సుమారు 30 దేశాల నుండి 3000 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కరాటే పోటీల్లో సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణానికి చెందిన విద్యార్థులు 9 మంది రెండు గోల్డ్ మెడల్స్, 6 సిల్వర్ మెడల్స్, మూడు బ్రౌంజ్ మెడల్స్ సాధించారని కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ తెలిపారు. దుబ్బాక పట్టణంలోని లచ్చపేట ఆదర్శ పాఠశాల హర్షవర్ధన్ కట గోల్డ్ మెడల్, కుమిటి సిల్వర్ మెడల్. సరస్వతి గ్లోబల్ స్కూల్ రిశ్వత గోల్డ్ మెడల్, శిల్పిత సిల్వర్ మెడల్.మాస్టర్ మైండ్ స్కూల్ రిషి అఖిల్ సిల్వర్ మెడల్, సర్వజ్ఞ సిల్వర్ మెడల్, ప్రణవి బ్రౌంజ్ మెడల్, సాత్విక్ బ్రౌంజ్ మెడల్. గాయత్రి వివేకానంద విద్యాలయం మనస్విన్ కట సిల్వర్ మెడల్, కుమిటి బ్రౌంజ్ మేడం. దిశా స్కూల్ ఆరావ్ సిల్వర్ మెడల్ సాధించారని తెలిపాడు. ఈ పథకాలు సాధించిన విద్యార్థులను ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ బుచ్చిబాబు, సరస్వతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపల్ వెంకట్ రెడ్డి, మాస్టర్ మైండ్ స్కూల్ ప్రిన్సిపల్ హరిబాబు, దిశా స్కూల్ ప్రిన్సిపల్ కమలాకర్, యాదగిరి, గాయత్రి వివేకానంద విద్యాలయం ప్రిన్సిపల్ భాస్కర్ రెడ్డి, యువర్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ ఫౌండర్ అండ్ డైరెక్టర్ కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్, రేంజుకి షోతోకన్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఇండియా వ్యవస్థాపకులు మాస్టర్ నగేష్, జనరల్ సెక్రెటరీ నవీన్ కుమార్,షైనరాయి షోతోకన్ కరాటే అకాడమీ ఫౌండర్ అండ్ డైరెక్టర్ సురేందర్ సుబ్బు, కిక్కర్స్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ నాగరాజు, షీ టీం లక్ష్మీ సామ్రాజ్యం అభినందించారు.

# వీధి దీపాల మరమ్మతులు వేగవంతం చేయాలి

## సామెల్ కార్తీక్



**శేరిలింగంపల్లి, ఆగస్టు 3 (జనం వార్త):** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి శేరిలింగంపల్లి డివిజన్‌లోని పాపిరెడ్డి కాలనీ, రాజీవ్ గృహకల్ప, లింగంపల్లి గ్రామం, గోపీ నగర్, నెహ్రూ నగర్, ఆదర్శ్ నగర్ ప్రాంతాల్లో వెలగని వీధి దీపాలను తక్షణమే మార్చి కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేయాలని టీపీసీసీ కార్యదర్శి, కంటెస్టెడ్ కార్పొరేటర్ సామెల్ కార్తీక్ సోమవారం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. బోనాల ఉత్సవాలతో పాటు రానున్న వినాయక చవితి, దసరా నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా వీధి దీపాల మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా సామెల్ కార్తీక్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన వీధి దీపాలను ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉమ్మడి జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. పదేళ్లపాటు మున్సిపల్ శాఖ మంత్రిగా పనిచేసిన కేటీఆర్ కనీస వసతులు కల్పించడంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రస్తుతం కొందరు వీడియోల కోసం అధికారులపై విమర్శలు చేయడం సరికాదని, గత పాలనలో ప్రతిపక్ష నేతలను అధికారులు కలిసే పరిస్థితి కూడా ఉండేది కాదని అన్నారు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వంలో ప్రతిపక్ష నాయకుల వినతులను కూడా గౌరవంగా స్వీకరించి సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్య పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల కోసం అంకితభావంతో పనిచేస్తున్న అధికారులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సూర్య రాథోడ్, విద్యార్థి నాయకుడు ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గులాబీ గూటికి కమలం నేత

- బీజేపీకి షాక్.. బీఆర్ఎస్‌కు జోష్
- కేటీఆర్ సమక్షంలో కీలక చేరిక



**శేరిలింగంపల్లి, ఆగస్టు 3(జనం వార్త):** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి రోజురోజుకూ ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున గులాబీ గూటికి చేరుతున్నారు. క్షేత్రస్థాయిలో మారుతున్న రాజకీయ పరిణామాల నడుమ బీఆర్ఎస్ బలోపేతం దిశగా అడుగులు వేస్తుండగా, తాజాగా మాదాపూర్ డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు మదనాచారి సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) మదనాచారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ చేరిక కూకట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రోత్సాహంతో, బొబ్బ నవత రెడ్డి సహకారంతో, శ్రీనివాస్ గౌడ్, రాయల కార్తిక్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్‌పై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతోందని, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. అనంతరం మదనాచారి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు తనను ఆకట్టుకున్నాయని తెలిపారు. పార్టీ బలోపేతానికి శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో కృషి చేస్తానని, పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో పాటు లక్ష్మణ్, నరేందర్ రెడ్డి, అభినంద్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్‌లో చేరికలు కొనసాగుతుండటంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

# దళిత హామీలు వెంటనే అమలు చేయాలి



## దళిత హక్కుల పోరాట సమితి

**శేరిలింగంపల్లి, ఆగస్టు 3(జనం వార్త):** దళితులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) డిమాండ్ చేసింది. రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జిల్లా సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి కే వెంకటస్వామి అధ్యక్షత వహించగా, జిల్లా ఇన్‌చార్జి టి. రామకృష్ణ మాట్లాడుతూ దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా అంబేద్కర్ అభయహస్తం పథకం కింద ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సహాయం విడుదల చేయాలని, దశాబ్దాలుగా సాగు చేస్తున్న అసైన్డ్ భూములపై పరిమితులు తొలగించి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో దళిత కుటుంబాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించకుండా విద్య, ఉపాధి, మౌలిక వసతుల కోసం పూర్తిస్థాయిలో వినియోగించాలని కోరారు. అలాగే నిరుపేద దళితులకు ఇంటి స్థలాలు కేటాయించి పట్టాలు పంపిణీ చేయాలని, డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు ఇచ్చి నెలకు రూ.10 వేల గౌరవ వేతనం చెల్లించాలని, స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్సీ లబ్ధిదారుల పెండింగ్ సబ్సిడీలు విడుదల చేయడంతో పాటు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యువతకు రుణాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దళితుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి సీపీఐ కార్యదర్శి కె. చందు యాదవ్, జెట్టి శ్రీనివాస్, ఎస్. కొండలయ్య, కూన సుధాకర్, ఎస్. నారాయణ, కూన కాసిం, బి. రామస్వామి, ఎస్. నరసమ్మ, రఘు, భాస్కర్, చెన్నయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# తల్లిపాలే శిశువుకు ఆరోగ్యం

## అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు

**కాకినాడ :** పుట్టిన ప్రతి శిశువుకు ఆరు నెలల పాటు తల్లిపాలు ఇవ్వడం వల్ల శిశువు ఆరోగ్యంగా ఎదుగుతుందని అంగన్వాడి టీచర్ హేమలత తెలిపారు. యూ. కొత్తపల్లి రమణక్కపేటలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ఉత్సవాలను పురస్కరించుకొని గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం, తొలి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలే అందించడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారమని, వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రం సీడీపీవో, సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్ హేమలత, నవ్య, సింహాచలం, వరలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.



# టెట్ మెటీరియల్‌ను రూపొందించిన ఎస్.టి.యు-టి.ఎస్ జిల్లా శాఖ

## అభినందించిన మేడ్చల్ జిల్లా విద్యాధికారిని రేణుకాదేవి

**మేడ్చల్ :** స్టేట్ టీచర్స్ యూనియన్ టి.ఎస్, రాష్ట్ర నాయకులు రూపొందించిన టెట్ మెటీరియల్ ( టెట్ ) పాస్ కాని ఉపాధ్యాయులకు ఎంతగానో ఉపయోగపడుతుందని మేడ్చల్ - మల్కాజ్ గిరి జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. సోమవారం ఆమె జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో టెట్ మెటీరియల్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ ఏడీ లింగానందం, సూపర్ ఇంటెండెంట్ సంధ్య, ఎస్. ఓ అయ్యన్న, డి.ఎస్.వో శ్రీనివాసరెడ్డి, జిల్లా ఎస్.టి.యు - టి.ఎస్ మేడ్చల్ - మల్కాజ్ గిరి జిల్లా అధ్యక్షులు బి. వెంకటేశ్వర్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఊరెళ్ల విఠల్, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు చందర్, జిల్లా సహాధ్యక్షులు అశోక్ కుమార్, కీసర మండల ప్రధాన కార్యదర్శి సతీష్, దుండిగల్ మండల అధ్యక్షులు వెంకటేశ్వరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి రేణుకాదేవి మాట్లాడుతూ, టెట్ పాస్ కాని ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, జిల్లాలో మిగిలి ఉన్న ఉపాధ్యాయులు పాస్ కావాలన్నారు. ఉపాధ్యాయుల కోసం ఈ విధంగా ఆలోచించి ఇంత తక్కువ ధరలో టెట్ మెటీరియల్ ను రూపొందించిన స్టేట్ టీచర్స్ యూనియన్ మేడ్చల్ జిల్లా శాఖ ను అభినందించారు. భవిష్యత్తులో కూడా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అండగా ఎస్.టి.యు - టి.ఎస్ ఉండాలని కోరారు.

# కే.వి.స్కూల్‌లో 'అరైవ్ అలైవ్' ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం




**సికింద్రాబాద్ :** మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ట్రాఫిక్-1 డీసీపీ కె. రాహుల్ రెడ్డి, ఐపీఎస్ పర్యవేక్షణలో "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా తిరుమలగిరి ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో కే.వి. స్కూల్, పికెట్ (మారేడ్‌పల్లి)లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ జి. శంకర్ రాజు రోడ్డు భద్రత ప్రాముఖ్యత, ట్రాఫిక్ నిబంధనల పాటింపు, బాధ్యతాయుతమైన రహదారి వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో సీటుబెల్ట్ వినియోగించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలని, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదని, మైనర్లతో వాహనాలు నడపించరాదని, లేన్ క్రమశిక్షణ పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు. కార్యక్రమంలో తిరుమలగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఐ.వి. రమణయ్య, సబ్ ఇన్‌స్పెక్టర్లు, కే.వి. స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ ముకేష్, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ రోడ్డు భద్రతకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు.



# సరోగసీ పై సమీక్షించిన డీ.ఏం అండ్ హెచ్.ఓ

**మేడ్చల్ :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డా: కె. ఆనంద్ అధ్యక్షతన సోమవారం కలెక్టరేట్ లోని తమ కార్యాలయంలో జిల్లా సరోగసీ బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిఈఏ ప్రోగ్రామ్ అధికారి డా: గీత , గైనకాలజిస్టు డా: మాధవీలత, శిశు వైద్య నిపుణులు డా: శివకుమార్ లు పాల్గొన్నారు. సమావేశంలో సరోగసీ విధానం కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్దేశిత దంపతుల దరఖాస్తులను సరోగసీ నియంత్రణ చట్టం--2021 మార్గదర్శకాల ప్రకారం పరిశీలించారు. అర్హతలు, అవసరమైన పత్రాలు వైద్య ప్రమాణాలను క్షుణ్ణంగా సమీక్షించిన అనంతరం అర్హులైన దంపతులకు జిల్లా స్థాయి సర్టిఫికెట్లు జారీ చేశారు.

జనం వార్త
ప్రతి అక్షరం... జనం కోసం...

# నిమ్స్‌లో వెయ్యి రోబోటిక్ సర్జరీలు

## డాక్టర్లు, సిబ్బందిని అభినందించిన మంత్రి దామోదర





**హైదరాబాద్, ఆగస్ట్ 3 :** నిమ్స్ హాస్పిటల్ మరో ఘనతను సాధించింది. రెండున్నర సంవత్సరాల వ్యవధిలోనే నిమ్స్ హాస్పిటల్‌లో 1,000 రొబోటిక్ సర్జరీలను విజయవంతంగా పూర్తి చేసినట్లు నిమ్స్ డైరెక్టర్, డాక్టర్ రాహుల్ దేవరాజ్ తెలిపారు. సోమవారం సచివాలయంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహని కలిసిన డాక్టర్ రాహుల్ దేవరాజ్, నిమ్స్ సాధించిన ఈ ఘనతను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్‌తో పాటు రొబోటిక్ సర్జరీల్లో భాగస్వాములైన డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, ఇతర సిబ్బందిని మంత్రి అభినందించారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో అత్యాధునిక వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో నిమ్స్ కీలక పాత్ర పోషిస్తోందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. ఇటీవలే నిమ్స్‌లో 2,000 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు పూర్తవడం, ఇప్పుడు 1,000 రొబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవడం ప్రభుత్వ వైద్యరంగ సామర్థ్యానికి నిదర్శనమని మంత్రి అన్నారు. దక్షిణ భారతదేశంలో ప్రభుత్వ రంగంలో తొలి రొబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్‌ను విజయవంతంగా నిర్వహించిన నిమ్స్, దేశంలోనే ప్రముఖ అవయవ మార్పిడి కేంద్రాల్లో ఒకటిగా నిలిచిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యాధునిక వైద్య సేవలను మరింత విస్తరిస్తోందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం నిమ్స్‌తో పాటు ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్‌లో కూడా రొబోటిక్ సర్జరీలు విజయవంతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. నిర్మాణంలో ఉన్న కొత్త టిమ్స్ హాస్పిటళ్లతో పాటు గాంధీ, కొత్త ఉస్మానియా హాస్పిటల్‌లోనూ అత్యాధునిక రొబోటిక్ ఆపరేషన్ థియేటర్లను ఏర్పాటు చేసి, ప్రపంచ స్థాయి వైద్య సేవలను ప్రభుత్వ రంగంలోనే అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వెల్లడించారు. రాహుల్ దేవరాజ్ మాట్లాడుతూ.. నిమ్స్‌లో ఇప్పటివరకు నిర్వహించిన వెయ్యి రొబోటిక్ సర్జరీల్లో యూరాలజీ విభాగంలో 590, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగంలో 248, సర్జికల్ ఆంకాలజీ విభాగంలో 162 శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ శస్త్రచికిత్సల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి వంటి ప్రభుత్వ పథకాల ద్వారా రోగులకు పూర్తిగా ఉచితంగా నిర్వహించడం విశేషమని తెలిపారు. దీంతో ఖరీదైన రొబోటిక్ సర్జరీలను కూడా సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురాగలిగామని చెప్పారు. విజయానికి యూరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, అనస్థీషియా విభాగాలు, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందం, ఇతర సహాయక విభాగాల సమిష్టి కృషి కారణమని డాక్టర్ రాహుల్ దేవరాజ్ తెలిపారు. రాష్ట్రంలో ఆధునిక వైద్య సేవల బలోపేతానికి నిరంతరం సహకరిస్తున్న ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గారికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ఈ సందర్భంగా డాక్టర్ రాహుల్ దేవరాజ్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అత్యాధునిక, నాణ్యమైన వైద్య సేవలను అందించడంలో నిమ్స్ మరిన్ని మైలురాళ్లు సాధించే దిశగా ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు



## బీహార్‌లో బిజెపికి అతిపెద్ద షాక్

- బంకీపూర్ అసెంబ్లీలో ప్రశాంత్ కిశోర్ భారీ విజయం
- 30 ఏళ్ల కంచుకోటను బద్దలు కొట్టిన ప్రశాంత్

**పాట్నా,ఆగస్టు 3 :** బీహార్‌లో సరికొత్త రాజకీయం ఆవిష్కృతం అయ్యింది. అలాగే బిజెపికి అతిపెద్ద షాక్ తగిలింది. బంకీపూర్ శాసనసభ ఉపఎన్నికల్లో జన్ సూరాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ సంచలన విజయం సాధించారు. గత 30 ఏళ్లుగా బిజెపికి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో పీకే గెలుపు జెండా ఎగరేశారు. ప్రశాంత్ కిశోర్ తన సమీప బీజేపీ అభ్యర్థి నీరజ్ సిన్హాపై 18,953 ఓట్ల భారీ తేడాతో ఘన విజయం సాధించారు. ఉదయం కౌంటింగ్ మొదలైనప్పటి నుంచీ బీజేపీ నేత నీరజ్ కుమార్ కంటే ముందంజలో ఉన్న ప్రశాంత్ కిశోర్ ఒక్కో రౌండ్ ముగిసేసరికి తన ఆధిక్యాన్ని అంతకంతకూ పెంచుకున్నారు. పీకేకు 63,203 పోలయ్యాయి. అలానే రెండో స్థానంలో నిలిచిన బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ కు 44,250, మూడో స్థానంలో నిలిచిన ఆర్జేడీ అభ్యర్థి రేఖ కుమారి 14,085 ఓట్లు సాధించారు. ఈ చరిత్రాత్మక విజయం అనంతరం ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ.. తన గెలుపు బిజెపి హైకమాండ్‌కు ఒక బలమైన సందేశమని వ్యాఖ్యానించారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తిని బిహార్ ముఖ్యమంత్రిగా చేశారని తీవ్రస్థాయిలో మండిపడిన ఆయన, సామ్రాట్ చౌదరిని వెంటనే సీఎం పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ ఉపఎన్నిక ఫలితం బిహార్ రాజకీయాల్లో సరికొత్త మార్పునకు సంకేతమని ఆయన పేర్కొన్నారు. రాజ్యసభకు ఎన్నికైన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్.. బంకీపూర్ ఎమ్మెల్యేగా రాజీనామా చేశారు. దీంతో ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నిక నిర్వహించారు. బీజేపీ కంచుకోటగా పేరున్న ఈ నియోజకవర్గంలో.. 1995 నుంచి బీజేపీ అభ్యర్థులే విజయం సాధిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రశాంత్ కిశోర్ అసాధారణ విజయం సాధించడం, బీజేపీ కంచుకోటలో జేఎస్పీ జెండా ఎగురవేయడం యావత్ దేశం దృష్టిని ఆకర్షించింది. ప్రశాంత్ విజయంతో.. జేఎస్పీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నాయి.

## బిజెపికి వరుస దెబ్బలు

### మధ్యప్రదేశ్, బీహార్ ఉప ఎన్నికల్లో అభ్యర్థుల ఓటమి
### గుజరాత్‌లో మాత్రం గెలుపు

**న్యూఢిల్లీ, ఆగస్టు 3 :** భారతీయ జనతా పార్టీకి వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. పేపర్ లీకేజీల వివాదంపై నిరసనల నడుమ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన పరిణామం మరవకముందే..బీజేపీ పాలిత రాష్ట్రాలైన బిహార్, మధ్యప్రదేశ్ ఉపఎన్నికల్లో ఆ పార్టీ పరాజయం పాలైంది. సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీలకే ఉపఎన్నికల్లో మొగ్గు ఉండే ఆనవాయితీకి భిన్నంగా బిహార్‌లోని బంకీపూర్, మధ్యప్రదేశ్‌లోని దతియా స్థానాల్లో బీజేపీ ఓటమి పాలవడం కమలదళాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. అయితే గుడ్డిలో మెల్లలా గుజరాత్ మంజల్‌పూర్ స్థానాన్ని గెలుచుకుని పరువు దక్కించుకుంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ రాజీనామాతో ఖాళీ అయిన బంకీపూర్ స్థానం బీజేపీకి దశాబ్దాలుగా బలమైన కోట. గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి 50,000 పైచిలుకు మెజారిటీ సాధించిన బీజేపీకి ఈసారి గట్టి షాక్ తగిలింది. రాజకీయ వ్యూహకర్త నుంచి రాజకీయ నాయకుడిగా మారిన ప్రశాంత్ కిశోర్ (జన్ సురాజ్ పార్టీ) బంకీపూర్ స్థానంలో విజయం సాధించి, బిహార్ శాసనసభలో తొలిసారి ఖాతా తెరిచారు. బీజేపీ ఓటు బ్యాంక్ ఏకంగా మూడోవంతుకు పడిపోయింది. నీట్ పేపర్ లీక్ ఆందోళనలు, యూజీసీ గైడ్‌లైన్స్, స్థానిక విద్యార్థుల నిరసనలు, పోలీసుల చర్యల వల్ల యువత, బీజేపీ సాంప్రదాయ ఓటర్లు దూరమవ్వడమే కాక, పోలింగ్ శాతం గణనీయంగా తగ్గడం ఓటమికి ప్రధాన కారణమైంది. గతంలో 46,000 ఓట్లు సాధించిన ఆర్జేడీ అభ్యర్థి రేఖా గుప్తా కూడా ఈసారి 15,000 ఓట్లకు పరిమితమయ్యారు. బీజేపీ అగ్రవర్ణ ఓట్లను చీల్చేందుకు ఆర్జేడీ సైలెంట్‌గా తన ఓటు బ్యాంకును ప్రశాంత్ కిశోర్‌కు బదిలీ చేసిందనే ఆరోపణలను బీజేపీ గుప్పిస్తోంది.

## ఉరవకొండలో వైకాపా ఆందోళనతో ఉద్రిక్తం

### మాజీ ఎమ్మెల్యేను అరెస్ట్ చేసిన పోలీసులు

**అనంతపురం,ఆగస్ట్3 :** అనంతపురం జిల్లా ఉరవకొండలో వైకాపా నేతల ఆందోళనతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నియోజకవర్గంలో దౌర్జన్యాలు, భూ ఆక్రమణలు పెరిగాయంటూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట వైకాపా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి ధర్నాకు పిలుపునిచ్చారు. ఈ ధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించారు. ఆయన్ను ఉరవకొండలోని వైకాపా కార్యాలయం వద్ద పోలీసులు అరెస్టు చేయడానికి ప్రయత్నించారు. అయితే.. వైకాపా శ్రేణులు మూకుమ్మడిగా పోలీసులను అడ్డుకున్నారు. పోలీసులు విశ్వేశ్వర్ రెడ్డిని వాహనం ఎక్కించగానే ఆ పార్టీ శ్రేణులు ఆక్సిజన్ సిలిండర్లు, రాళ్లను రోడ్డుకు అడ్డంగా వేసి గందరగోళం సృష్టించారు. ఎట్టకేలకు పోలీసులు విశ్వేశ్వర్ రెడ్డిని అరెస్టు చేసి గుంతకల్ వైపు తరలించారు. దీంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉరవకొండ ప్రధాన రహదారిపై బైఠాయించి వాహనదారులను, ప్రజలను అడ్డగించారు. ఉరవకొండలో ఉద్రిక్తత నేపథ్యంలో.. శివరామిరెడ్డి కాలనీలో ఉన్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## పలు జిల్లాలకు భారీ వర్ష హెచ్చరిక

**అమరావతి, ఆగస్ట్ 3 :** ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పిడుగుపాటుతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే విజయనగరం, విశాఖపట్నం, అల్లూరిసీతారామరాజు, అనకాపల్లి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఆరెంజ్ అలర్ట్ జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వానలు పడతాయని వెల్లడించారు. అరకు, చింతపల్లె, నర్సీపట్నంలో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపారు. యలమంచిలి, అనకాపల్లి, విశాఖపట్నం పరిసరాల్లో పిడుగులు పడే అవకాశం ఉందని చెప్తుకొచ్చారు. శ్రీకాకుళం, మన్యం, కాకినాడకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. అలాగే, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు ఎల్లో అలర్ట్ హెచ్చరికలు చేశారు. ఏలూరు, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడే సూచనలు ఉన్నాయని వెల్లడించారు. ఎల్లో అలర్ట్ జిల్లాల్లో చెదురుమదురుగా పిడుగులతో కూడిన వానలు కురుస్తాయని తెలిపారు. ఉరుములు, పిడుగులు పడే సమయంలో ప్రజలు చెట్ల కింద నిలబడవద్దని సూచించారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## కర్నాటక కాంగ్రెస్‌లో విస్తరణ చిచ్చు

- 20 మంది కొత్త మంత్రుల ప్రమాణం
- చోటు దక్కని పలువురు ఎమ్మెల్యేల ఆగ్రహం
- అసమ్మతి నేతల ఆందోళనలు.. ధర్నాలు
- ఎమ్మెల్యే యశ్వంతరాయ గౌడ పాటిల్ రాజీనామా




**బెంగళూరు,ఆగస్టు 3 :** కర్ణాటక ముఖ్యమంత్రి డీ.కే. శివకుమార్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మంత్రివర్గ విస్తరణ రాష్ట్ర కాంగ్రెస్‌లో చిచ్చు రేపింది. ఆగ్రహావేశాలు, ఆనందోత్సాహాలను చవిచూడాల్సి వచ్చింది. కొందరిలో విపరీతమైన ఆనందోత్సాహానికి, మరికొందరిలో తీవ్ర ఆగ్రహావేశాలకు కారణమైంది. ఏకంగా 20 మంది కొత్త మంత్రుల ప్రమాణ-స్వీకారంతో ఒకవైపు పండుగ వాతావరణం సంతరించుకోగా, మరోవైపు తీవ్ర అసమ్మతి, ధర్నాలు, ఆందోళనలకు దారితీసింది. కేబినెట్‌లో చోటు దక్కకపోవడంతో అసమ్మతి నేతలు బహిరంగంగానే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి పదవి దక్కకపోవడంపై తీవ్ర మనస్థాపానికి గురైన ఎమ్మెల్యే యశ్వంతరాయ గౌడ పాటిల్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 'పార్టీ నాయకత్వం నన్ను తీవ్రంగా గాయపరిచింది. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను' అని ఆయన పేర్కొన్నారు. అలాగే బేలూరు ఎమ్మెల్యే గోపాలకృష్ణ కూడా రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, మైసూర్ నాయకుడు తన్వీర్ సేట్‌కు మంత్రివర్గంలో చోటు నిరాకరించడంతో, ఆయన మద్దతుదారుడొకరు మైసూరులో విషం తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. అతన్ని ప్రస్తుతం ఆసుపత్రికి తరలించగా, తన్వీర్ సేట్ నేరుగా వెళ్లి పరామర్శించారు. ధార్వాడ్‌లో ప్రసాద్ అబ్బయ్య మద్దతు దారులు రహదారిపై టైర్లు కాల్చి, ప్రభుత్వ బస్సుపై రాళ్ళు రువ్వి ఆందోళన చేపట్టారు. అసమ్మతి నేతల రహస్య భేటీ: హెచ్‌కే పాటిల్, దినేష్ గుండూరావుతో సహా పదవులు దక్కని సీనియర్ నాయకులు బెంగళూరులోని పీ.వీ. జయచంద్ర నివాసంలో అత్యవసర రహస్య సమావేశం ఏర్పాటు చేసి తదుపరి కార్యాచరణపై చర్చిస్తున్నారు. మంత్రి మునియప్ప అసంతృప్తి: మరోవైపు సీనియర్ నేత, కేబినెట్ మంత్రి కె.హెచ్. మునియప్ప కూడా తన శాఖ కేటాయింపుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, శాఖను మార్చాలని కోరుతున్నట్లు సమాచారం. ప్రమాణస్వీకారానికి కొన్ని గంటల ముందు కేబినెట్ జాబితాలో నాటకీయ మార్పులు చోటుచేసుకున్నాయి. తొలుత ప్రకటించిన ముసాయిదా నుంచి మంకాల్ వైద్య, గాయత్రి చంద్రశేఖర్‌లను తొలగించి, ఆఖరి నిమిషంలో సీనియర్ నేత ఎస్.ఎస్. మల్లికార్జున్‌కు కేబినెట్‌లో స్థానం కల్పించారు. కర్ణాటక కాంగ్రెస్ విస్తరణపై బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయా తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ చెబుతున్న సామాజిక న్యాయం, మహిళా సాధికారత మాటలకే పరిమితమని ఎద్దేవా చేశారు. కేబినెట్‌లో ఏకైక మహిళకే చోటు ఇవ్వడం, బ్రాహ్మణ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం లేకపోవడం, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న బి. నాగేంద్ర, జమీర్ అహ్మద్ ఖాన్‌లను తిరిగి కేబినెట్‌లోకి తీసుకోవడం కాంగ్రెస్ డొల్లతనాన్ని బయటపెడుతోందని ఆరోపించారు.



## ఖరీఫ్ పంటల బీమా గడువు పొడిగింపు

**అమరావతి, ఆగస్ట్3 :** రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఖరీఫ్ పంటల బీమా గడువును పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఖరీఫ్ పంటలకు బీమా నమోదు గడువును మరో 15 రోజులు పొడిగించినట్లు స్పష్టం చేసింది. జులై 31వ తేదీతో ముగియాల్సిన గడువుకు మరో 15 రోజులపాటు అవకాశం కల్పించినట్లు వెల్లడించింది. ప్రకృతి వైపరీత్యాలు, వరదలు, వర్షాభావం వల్ల పంట నష్టాలకు బీమా రక్షణ కల్పిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. రూ.1 ప్రీమియంతో అన్నదాతలకు పంటల బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు ఏపీ సర్కార్ వివరించింది. ఇప్పటికి కూడా నమోదు చేసుకోని రైతులు వెంటనే బీమా నమోదు చేసుకోవాలని సూచించింది. సాగు చేసిన ప్రతి ఎకరానికి బీమా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. బ్యాంకులు, సీఎస్సీ కేంద్రాలు, రైతు సేవా కేంద్రాలు, ఔఅఎఖ మొబైల్ యాప్‌ల ద్వారా నమోదు చేసుకోవచ్చని ఏపీ ప్రభుత్వం పేర్కొంది.

## ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి అరెస్టు

### బులిటెన్ విడుదల చేసిన శాసనసభ కార్యదర్శి

**కర్నూలు,ఆగస్ట్3 ::** కర్నూలు జిల్లా ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి అరెస్టు వ్యవహారంపై ఏపీ శాసనసభ కార్యదర్శి జనరల్ కార్యాలయం బులెటిన్ విడుదల చేసింది. శాసనసభ సభ్యులందరికీ సమాచారం అందిస్తూ జారీ చేసిన ఈ బులెటిన్‌లో ఎమ్మెల్యే అరెస్టుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బులెటిన్ ప్రకారం.. ఆగస్టు 2వ తేదీ తెల్లవారుజామున 3 గంటలకు కర్నూలు జిల్లా చిప్పగిరిలోని ఎమ్మెల్యే నివాసంలో విరూపాక్షిని పోలీసులు అరెస్టు చేశారు. ఎమ్మెల్యేను ఆలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అరెస్టు చేసినట్లు బులెటిన్‌లో వెల్లడించారు. చిప్పగిరి పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్ 37/2026 కేసులో అరెస్టు అయినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్)లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అలాగే చిప్పగిరి పోలీస్ స్టేషన్‌లోనే నమోదైన మరో క్రైమ్ నంబర్ 38/2026 కేసులోనూ ఎమ్మెల్యే ఏ-1గా ఉన్నట్లు అసెంబ్లీ బులెటిన్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో బీఎన్‌ఎస్ సెక్షన్లతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కూడా కేసులు నమోదు చేసినట్లు ఎమ్మెల్యేలకు సమాచారం ఇచ్చారు. శాసనసభ్యుడి అరెస్టు జరిగిన నేపథ్యంలో సభా నిబంధనల ప్రకారం సభ్యులందరికీ వివరాలు తెలియజేస్తూ అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ఈ బులెటిన్ జారీ చేశారు. శనివారం నాడు చిప్పగిరి మండలం నేమకల్లు, సంగాల గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలపై వందలాది మంది అనుచరులతో ఎమ్మెల్యే విరూపాక్షి దాడి చేశారు. పలువురు టీడీపీ కార్యకర్తల ఇళ్లపైకి వెళ్లి ఆడ, మగ అనే తేడా లేకుండా తీవ్రంగా గాయపరిచారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే విరూపాక్షి సహా 34 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిలో 16 మందిని అరెస్టు చేయగా.. ఆలూరు కోర్టు రిమాండ్ విధించింది.



## క్రెడిట్ లేని వ్యక్తి వైఎస్ జగన్

### ఆయన క్రెడిట్ అంతా కత్తులూ.. కటార్లే

### విమర్శలు గుప్పించిన మంత్రి సంధ్యారాణి

**అమరావతి,ఆగస్ట్3 :** వైకాపాలోని కొందరు నేతలు ప్రజలకు నీతులు చెబుతున్నారని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఎద్దేవా చేశారు. నేరాలు చేసిన నేతలు ఎక్కడున్నా తీసుకొచ్చి శిక్షిస్తామన్నారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. భోగాపురం విమానాశ్రయంపై వైకాపా నేతల వ్యాఖ్యలు సరికాదన్నారు. మేం చేసిన పనులను జగన్ క్రెడిట్ చోరీ చేస్తున్నారు. ఆయనకు క్రెడిటే లేదు.. చోరీ ఎక్కడిది. క్రెడిట్ అనే పదం జగన్‌కు వర్తించదు. ఆయన క్రెడిట్ అంటే.. నాలుగు కత్తులు, నాలుగు గొడ్డళ్లు. హత్యలు చేసినవాళ్లని వెనకేసుకుని రావడం, బూతులు మాట్లాడిన వాళ్లకు మంత్రి పదవులు ఇవ్వడమే ఆయనకు తెలుసు. శస్త్రచికిత్స చేయించుకున్న సొంత చెల్లినే పరామర్శించలేదు. నేరాలు చేసి జైళ్లలో ఉన్నవారిని మాత్రం జగన్ పరామర్శిస్తున్నారని సంధ్యారాణి విమర్శించారు. ఇదిలావుంటే జగన్ మోహన్‌రెడ్డితో పాటు ఆ పార్టీ నాయకులంతా భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కి సంబంధించి క్రెడిట్ చోరీ చేస్తున్నారని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విమర్శించారు. విశాఖపట్నంలో, ఆంధ్రప్రదేశ్‌లో ఏదైనా మంచి ఇన్వెస్ట్‌మెంట్, పేరువచ్చే కార్యక్రమం జరిగితే.. వెంటనే వైకాపా పార్టీ ట్వీట్ చేయడం, జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడటమో గానీ చేస్తారని అన్నారు. అది కూడా మాదే. మేము తెచ్చిందే, మా ఖాతాలోకే అనే కొత్త సంప్రదాయాన్ని తీసుకొస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఘనత చంద్రబాబుదే అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా భోగాపురం నిర్మాణం పూర్తి వివరాలు వెల్లడించారు.

## ప్రధాని మోడీపై మైనర్ బాలిక వ్యాఖ్యల కేసు

- క్షమించానని.. కేసులతో వేదించమని ప్రధాని హామీ
- కేసును వెనక్కు తీసుకున్నట్లు ఢిల్లీ పోలీసుల ప్రకటన

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 3 :** నీట్ పేపర్ లీక్ ఆందోళనల్లో భాగంగా ప్రధాని మోదీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన మైనర్ బాలికపై కేసును కొనసాగించబోమని దిల్లీ పోలీసు వర్గాలు స్పష్టం చేశాయి. ఈ ఘటనకు సంబంధించి నోయిడా పోలీసులు ఇటీవల జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి దిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఆమె వ్యాఖ్యలు ప్రధాని పదవిని అగౌరవపర్చేలా, శాంతియుత పరిస్థితులకు భంగం కలిగించేలా ఉన్నాయంటూ అందిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదైంది. అయితే, ప్రస్తుతం ఆ కేసును బాలికపై కొనసాగించడం లేదని పోలీసులు వెల్లడించారు. తన కుమార్తెపై నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లో పోలీసులు వయసు 25 ఏళ్లుగా నమోదు చేశారని.. కానీ, ఆమె వయసు 15 ఏళ్లే అని తన తల్లి చెప్పిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఈ క్రమంలోనే బాలిక తల్లి తప్పు తెలుసుకుని ప్రధాని మోదీకి క్షమాపణలు చెప్పిన విషయం తెలిసిందే. తన కుమార్తెను క్షమించి గొప్ప మనసు చాటుకున్నారని ఆమె ప్రధానిని కొనియాడారు. 18 ఏళ్లలోపు పిల్లలకు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలను నిషేధించాలని ఆమె సూచించారు. చిన్నారులకు తెలియక సులభంగా ఇతరుల ప్రభావానికి లోనయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. వారి దృష్టి చదువులపైనే ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జంతర్‌మంతర్ నిరసనల సందర్భంగా ప్రధానిని ఉద్దేశించి అసభ్యపదజాలంతో మాట్లాడిన బాలికపై కేసు పెట్టవద్దని ఢిల్లీ పోలీసులు నిర్ణయించినట్టు జాతీయ మీడియాలో కూడా కథనాలు వెలువడ్డాయి. ఈ ఉదంతానికి సంబంధించి తొలుత నోయిడా పోలీసులు జీరో ఎఫ్‌ఐఆర్ ఫైల్ చేసిన విషయం తెలిసిందే. ఆ తరువాత ఢిల్లీ పోలీసులు ఈ ఉదంతంపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో బాలిక ప్రధానికి క్షమాపణ చెబుతూ వీడియో రిలీజ్ చేసింది. తనకు 15 ఏళ్లేనని, నిరసన వద్ద ఇతరుల ప్రభావానికి లోనై అలాంటి వ్యాఖ్యలు చేశానని వివరణ ఇచ్చుకుంది. ఇది తన చివరి తప్పిదమని కూడా చెప్పింది. ఈ క్రమంలో ప్రధాని మోదీ కూడా సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తప్పుదారి పట్టిన పిల్లలను క్షమించాలని అభిప్రాయపడ్డారు. వారిని శిక్షించడం, కోర్టుల చుట్టూ తిప్పడం వల్ల ప్రయోజనం ఉండదని అన్నారు. బాలిక తల్లి కూడా ఈ ఉదంతంపై స్పందించారు. తన కుమార్తెను క్షమించిన ప్రధాని ఆమెకు జీవనదానం చేశారని అన్నారు. బాలికపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియా వాడకుండా మైనర్లపై నిషేధం ఉండాలని కూడా అభిప్రాయపడ్డారు. అయితే తన కుమార్తెను ప్రధాని క్షమించినా పోలీసులు ఇంకా ఎఫ్‌ఐఆర్‌ను వెనక్కు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాలిక చేసిన తప్పునకు పశ్చాత్తాపడుతోందని చెప్పారు. తప్పుదారి పట్టిన చిన్నారులను క్షమించాలని, సక్రమమార్గంలో నడిపించాలని ప్రధాని చెప్పినా పోలీసులు ఇంకా ఎఫ్‌ఐఆర్ వెనక్కు తీసుకోలేదని అన్నారు. పెద్దల విషయంలో తన కూతురు అసభ్య పదజాలం వాడి ఉండాల్సింది కాదని అన్నారు. నిరసన తెలిపేందుకు, వివిధ వేదికల్లో తమ అభిప్రాయాలను వినిపించేందుకు యువతకు హక్కు ఉన్నప్పటికీ అసభ్య భాష మాత్రం వాడకూడదని బాలిక తల్లి అభిప్రాయపడ్డారు. పుట్టిన రోజుకోసం దుస్తులు కొనుక్కుంటానని జులై 23న తన కుమార్తె బయటకు వెళ్లిందని చెప్పారు. ఆమె వైరల్ వీడియోను బంధువులు పంపించాకే ఈ విషయం తమకు తెలిసిందని చెప్పారు. 'ఘటన గురించి వెలుగులోకి వచ్చాక మేము ముఖం దాచుకుని బయటకు వెళ్లాల్సి వస్తోంది. గతంలో ఉన్న ప్రాంతం నుంచి మేము మరో చోటకు మారిపోయాము. తరచూ మకాం మార్చాల్సి వస్తోంది. బాలిక మైనర్ అని ఇప్పటికే నిర్ధారణ అయ్యింది. కానీ ఆమెపై ఎఫ్‌ఐఆర్ మాత్రం ఇంకా వెనక్కు తీసుకోలేదు' అని బాలిక తల్లి తెలిపారు. బాలిక కూడా క్షమాపణ చెప్పిన విషయాన్ని పేర్కొన్నారు. 'ప్రధాని స్వయంగా ఆమెను క్షమించినప్పుడు పోలీసులు కూడా కేసు క్లోజ్ చేసి ఎఫ్‌ఐఆర్‌ను వెనక్కు తీసుకోవాలి' అని అభ్యర్థించారు. తమకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని కూడా స్పష్టం చేశారు

# లాభాల్లో ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో చర్చలు ఉంటాయని ప్రకటించడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారాయి. దీంతో చమురు ధరలు మరోసారి దిగొచ్చాయి. విదేశీ మదుపర్ల పెట్టుబడులు కలిసొచ్చాయి. దీంతో సూచీలు వరుసగా నాలుగో సెషన్‌లోనూ లాభాల్లో ముగిశాయి. మదుపర్ల సంపద ఒక్క సెషన్‌లోనే రూ.5 లక్షల కోట్ల మేర పెరిగింది. ఉదయం సెన్సెక్స్ 78,883.34 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,094.64) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 78,895.10 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి సెన్సెక్స్ 544.39 పాయింట్లు లాభపడి 78,639.03 వద్ద ముగిసింది. నిఫ్టీ 390.70 పాయింట్లు పెరిగి 24,774.30 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.31 వద్ద ఉంది. సెన్సెక్స్ 30లో ఇండిగో, టీసీఎస్, ఇన్ఫోసిస్, ఎటర్నల్, ఐటీసీ, యాక్సిస్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. సన్‌ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్, మారుతీ, టాటాస్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్ షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో




బ్రెంట్ క్రూడ్ ధర 83.83 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,054.64 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.






## ఈసారీ రేట్ల కోత లేనట్లే..

### ఆర్‌బీఐ ఎంపీసీ భేటీ ప్రారంభం

**ముంబయి:** కీలక వడ్డీ రేట్లపై నిర్ణయం తీసుకునేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య పరపతి విధాన కమిటీ సోమవారం సమావేశమైంది. మూడు రోజుల భేటీ అనంతరం ఆగస్టు 5న ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సమీక్షా నిర్ణయాలను ప్రకటించనున్నారు. ఈసారీ వడ్డీ రేట్ల కోత ఉండకపోవచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక పరిస్థితులు, ద్రవ్యోల్బణ భయాల నేపథ్యంలో మరోసారి యథాతథ స్థితినే (స్టేటస్ కో) కొనసాగించే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పశ్చిమాసియా ఘర్షణల ప్రభావాన్ని అంచనా వేసేందుకు జూన్ నెలలో జరిగిన ఎంపీసీ భేటీలో వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పు చేయలేదు. రెపో రేటును 5.25 శాతం వద్దే ఆర్‌బీఐ స్థిరంగా ఉంచింది. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగి దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలకు రెక్కలు వచ్చిన నేపథ్యంలో 2026–27 ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణ అంచనాలను ఆర్‌బీఐ సవరించింది. ముందుగా అనుకున్న 4.6 శాతం నుంచి 5.1 శాతానికి పెంచింది. జీడీపీ వృద్ధి అంచనాలను 6.9 శాతం నుంచి 6.6 శాతానికి తగ్గించింది. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ ఎంపీసీ తాజాగా భేటీ అయ్యింది. అంతర్జాతీయ భౌగోళిక అనిశ్చితులు ఇంకా కొనసాగుతున్నాయని, క్రూడాయిల్, కరెన్సీ కూడా తీవ్ర ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నాయని బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ ఎకనమిస్ట్ మదన్ సబ్నవిస్ పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల ద్రవ్యోల్బణం పెరిగే సూచనలు కూడా ఉన్న వేళ ఆర్‌బీఐ ఎంపీసీ.. రెపో రేటు, వైఖరి విషయంలో స్టేటస్ కో కొనసాగించొచ్చని అభిప్రాయపడ్డారు. పశ్చిమాసియాలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధం, నైరుతి రుతు పవనాల ప్రభావంపై ఒక స్పష్టత వచ్చే వరకు ఎంపీసీ వేచి చూసే ధోరణి అవలంబించొచ్చని క్రిసిల్ లిమిటెడ్ సీనియర్ డైరెక్టర్, ప్రిన్సిపల్ ఎనకమిస్ట్ దీప్తి దేశ్ పాండే అన్నారు.



## శ్రీలంకతో టెస్టు సిరీస్..

### బుమ్రా స్థానంలో అకిబ్ నబీకి ఛాన్స్

శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు అకిబ్ నబీ ఎంపికయ్యాడు. గాయం కారణంగా దూరమైన జస్‌ప్రీత్ బుమ్రా స్థానంలో నబీకి అవకాశం దక్కింది. ఈ మేరకు సోషల్ మీడియాలో బీసీసీఐ పోస్టు చేసింది. 29 ఏళ్ల ఈ జమ్ముకశ్మీర్ బౌలర్ చాన్నాళ్ల నుంచి భారత్ తరఫున అరంగేట్రం చేసేందుకు ఎదురు చూస్తున్నాడు. నబీ దేశవాళీ క్రికెట్‌లో అద్భుతమైన ప్రదర్శన చేయడంతో సెలక్షన్ కమిటీ మొగ్గు చూపింది. ఆగస్ట్ 15 నుంచి శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్ ప్రారంభం కానుంది. గత రంజీ ట్రోఫీని జమ్ముకశ్మీర్ నెగ్గడంలో అకిబ్ నబీదే కీలక పాత్ర. ఏకంగా 60 వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. దీంతో అతడికి భారత జట్టు నుంచి పిలుపు వచ్చింది. అఫ్గానిస్థాన్‌తో ఏకైక టెస్టులోనే అరంగేట్రం చేస్తాడని అంతా భావించారు. కానీ, అతడికి తుది జట్టులో అవకాశం కల్పించలేదు. దీంతో తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. ఇప్పుడు శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు ఎంపికైన నబీని తుది జట్టులో ఆడించాలనే డిమాండ్లు వస్తున్నాయి.

**శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు భారత జట్టు:** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, రిషభ్ పంత్ (వికెట్ కీపర్), సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్, మానవ్ సుతార్, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, దేవదత్ పడిక్కల్, సరాంశ్ జైన్, అకిబ్ నబీ

# ఆటగాళ్లకు ఫిట్‌నెస్ సమస్యలు

## చీఫ్ ఫిజియోపైనా బీసీసీఐ నజర్

**యూకే పర్యటనలో వరుస ఓటముల కారణంగా భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ బృందంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే ఇప్పటికే జట్టును వీడిన సంగతి తెలిసిందే. గత కొన్నాళ్లుగా ఫీల్డింగ్ దారుణంగా ఉండటంతో భారత జట్టుకు కొత్త ఫీల్డింగ్ కోచ్‌ను బీసీసీఐ నియమించింది. ఇప్పుడు చీఫ్ ఫిజియో కమ్లేశ్ జైన్‌పైనా బోర్డు దృష్టి సారించినట్లు వార్తలు వస్తున్నాయి. శ్రీలంకతో సిరీస్ అనంతరం ఓ నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది.**



నితిన్ పటేల్ స్థానంలో 2022లో కమ్లేశ్ చీఫ్ ఫిజియోగా బాధ్యతలు స్వీకరించారు. అయితే, గత కొద్ది నెలలుగా భారత ఆటగాళ్లు ఎక్కువగా గాయాలపాలు కావడం పెద్ద చర్చకు దారితీసింది. హర్షిత్ రాణా, నితీశ్ కుమార్, వాషింగ్టన్ సుందర్ గాయంతో జట్టుకు దూరమయ్యారు. తాజాగా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా కూడా లంకతో టెస్టు సిరీస్ నుంచి వైదొలిగాడు. అంతకుముందు ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌లో కెప్టెన్ గిల్, గుర్నూర్ బ్రార్ కండరాలు పట్టేయడంతో ఇబ్బంది పడటం చూశాం. ప్లేయర్ల గాయాల విషయంలో చీఫ్ ఫిజియోగా కమ్లేశ్ పనితీరుపై ప్రధాన కోచ్ గంభీర్, కెప్టెన్ గిల్ అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఫిట్‌నెస్ సమస్యలతో అత్యుత్తమ టీమ్‌ను బరిలోకి దింపలేకపోతున్నట్లు అసహనం వ్యక్తం చేసినట్లూ వార్తలు వచ్చాయి.

### సీవోఈపైనా ప్రశ్నలు

చీఫ్ ఫిజియో కమ్లేశ్ జైన్‌తోపాటు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పనితీరుపైనా అనుమానాలు వస్తున్నాయి. బుమ్రా ఫిట్‌నెస్ టెస్టులో పాసైనట్లు తొలుత సీవోఈ ప్రకటన చేసింది. తీరా, ఒక్క రోజు వ్యవధిలోనే అతడి గాయం ఇంకా మానలేదని.. శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో ఆడటం లేదని వెల్లడించింది. ఇక్కడా మేనేజ్‌మెంట్ సరిగా లేదనే విమర్శలు వస్తున్నాయి. స్క్వాడ్‌లోకి రావాలంటే తీవ్ర పోటీ ఉన్న ఇలాంటి సమయంలో గాయాల వల్ల కెరీర్‌లు డోలాయమానంలో పడే ప్రమాదం ఉందనేది కొందరి వాదన. తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా విషయంలోనూ ఇలాంటి తప్పిదాలే జరిగాయి. దీంతో శ్రీలంకతో టెస్టు సిరీస్ అనంతరం కోచింగ్ బృందంతోపాటు ఫిజియో, టీమ్ డాక్టర్ స్థానాల్లోనూ కొత్తవారు వచ్చే అవకాశం లేకపోలేదు. ప్రస్తుతం టీమ్ డాక్టర్‌గా రిజ్వాన్ ఖాన్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.



## ఐదేళ్ల ప్రయాణాన్ని వర్ణించడానికి మాటలు రావడం లేదు

### మాజీ ఫీల్డింగ్ కోచ్ దిలీప్

ఐదేళ్లపాటు టీమ్‌ఇండియా ఫీల్డింగ్ కోచ్‌గా సేవలందించిన టి.దిలీప్ పదవీకాలం ఇటీవల జింబాబ్వే పర్యటనతో పూర్తయింది. మళ్లీ అతని కాంట్రాక్టు పొడి గించలేదు. శుభదీప్ ఘోష్‌ను కొత్త ఫీల్డింగ్ కోచ్‌గా నియమించారు. భారత జట్టుతో తన ప్రయాణం ముగియడంతో దిలీప్ సోషల్‌మీడియాలో భావోద్వేగభరితమైన వీడ్కోలు లేఖను విడుదల చేశాడు. తనపై నమ్మకం ఉంచి భారత క్రికెట్‌కు సేవ చేసే అవకాశం కల్పించిన బీసీసీఐకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపాడు.

“కోచ్‌గా ఐదేళ్ల ప్రయాణాన్ని వర్ణించడానికి మాటలు రావడం లేదు.నేను మొదట ఈ జట్టులో చేరినప్పుడు ప్రతి రోజూ నా శాయశక్తులా కృషి చేయాలనే లక్ష్యంతో వచ్చాను. నేను ఎంతో ఇష్టపడే ఈ క్రీడకు ఫీల్డింగ్ పరంగా నా వంతు సహకారం అందించా. ఈ జట్టు ప్రయాణంలో భాగమయ్యే అవకాశం లభించినందుకు ఎంతో కృతజ్ఞుడిను. ప్రతి మ్యాచ్ అనంతరం అందించే బెస్ట్ ఫీల్డింగ్ మెడల్‌కు నా హృదయంలో ఎప్పటికీ ప్రత్యేక స్థానం ఉంటుంది. ఆ మెడల్ డ్రెస్సింగ్ రూమ్‌లోఎంతో ఉత్సాహాన్ని కలిగించింది. పతకాన్ని అందుకునే సమయంలో ఆటగాళ్ల చిరునవ్వులు, ఆటగాళ్లు దానికి ఇచ్చిన విలువ ఎప్పటికీ గుర్తుంచుకుంటాను. రెండు టీ20 ప్రపంచ కప్ (2024, 2026), ఛాంపియన్స్ ట్రోఫీ (2025), రెండు ఆసియా కప్‌లు (2023, 2025) సాధించడం.. డబ్ల్యూటీసీ, ప్రపంచ కప్ (2023)లలో రన్నరప్‌గా నిలవడంలో భాగం కావడం నాకు మధుర జ్ఞాపకాలు.

రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, విరాట్ కోహ్లీ, హార్దిక్ పాండ్య, శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్ వంటి కెప్టెన్లతో పనిచేశాను. వారు నాకు ఎంతగానో సహకరించారు. ప్రతి ఆటగాడికి, కోచ్‌కి, సహాయక సిబ్బంది సభ్యులకు ధన్యవాదాలు. మనం కలసి సృష్టించుకున్న ఈ జ్ఞాపకాలు జీవితాంతం నా మదిలో నిలిచిపోతాయి. ఐదు సంవత్సరాలపాటు టీమ్‌ఇండియా బ్యాడ్జ్‌ను ధరించే గౌరవం లభించినందుకు ఎల్లప్పుడూ కృతజ్ఞతతో ఉంటాను” అని దిలీప్ వీడ్కోలు సందేశంలో పేర్కొన్నాడు. భారత జట్టు కొత్త ఫీల్డింగ్ కోచ్‌గా నియమితుడైన శుభదీప్ ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో ప్రారంభం కానున్న రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌తో కోచ్‌గా తన ప్రయాణాన్ని మొదలుపెట్టనున్నాడు.



## భారత మ్యాప్ వివాదం..

### గ్లాస్గో రెస్టరంట్ క్షమాపణలు

నాప్‌కిన్‌లపై అసంపూర్తి భారత మ్యాప్‌ను ముద్రించిన గ్లాస్గోలోని రెస్టరంట్ ఎట్టకేలకు క్షమాపణలు చెప్పింది. భారత బాక్సర్ లవ్లీనాతో పాటు ఇతర అథ్లెట్లు ఆ రెస్టరంట్‌కు వెళ్లినప్పుడు ఈ తప్పిదాన్ని గమనించారు. దీనిపై భారత బాక్సింగ్ ఫెడరేషన్ కూడా మండిపడింది. దీంతో ఇది సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారిపోయింది. మ్యాప్ వివాదంపై స్కాట్లాండ్‌లోని భారత్ ఎంబసీ కూడా స్పందించింది. ఈ క్రమంలో సదరు రెస్టరంట్ క్షమాపణలు చెప్పడంతోపాటు తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను డిలీట్ చేసేసింది. లోగోను కూడా మారుస్తామంటూ ప్రకటన చేసింది. “మేము భారతీయ వారసత్వం పట్ల మేం గర్వపడుతున్నాం. భారత్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 32 ఏళ్లుగా మేం సేవలు అందిస్తున్నాం. అయితే, భారత్ మ్యాప్‌ను తప్పుగా చూపించినందుకు తొలుత మేం క్షమాపణలు చెబుతున్నాం. పొరపాటును సరిదిద్దడానికి తక్షణ చర్యలు తీసుకుంటాం. ఇది ఎవరినీ నొప్పించాలని చేసిందికాదు. భారత బృందానికి గర్వంగా సేవలు చేయాలనుకుంటున్నాం. సరైన మ్యాప్‌తో లోగోను మారుస్తాం. కామన్వెల్త్ గేమ్స్‌లో అద్భుత విజయాలు సాధించిన భారత అథ్లెట్లకు ఆతిథ్యం ఇవ్వడం మాకు దక్కిన గొప్ప గౌరవం. ఈ జ్ఞాపకాలు మాతో శాశ్వతంగా నిలిచిపోతాయి” అని మిస్టర్ సింగ్స్ ఇండియా టీమ్ ధికారికంగా ప్రకటనను జారీ చేసింది.

### అసలేం జరిగిందంటే?

గ్లాస్గోలోని ఓ రెస్టరెంట్‌కు లవ్లీనాతోపాటు కొందరు భారత అథ్లెట్లు డిన్నర్‌కు వెళ్లారు. అక్కడ ఉన్న హ్యాండ్ టవల్స్ (నాప్‌కిన్‌లు)పై భారత్ మ్యాప్ అసంపూర్తిగా ఉండటం లవ్లీనా గమనించింది. నార్త్ ఈస్ట్ రాష్ట్రాలతోపాటు కశ్మీర్ సరిగా లేకపోవడంతో సోషల్ మీడియా వేదికగా లవ్లీనా అభ్యంతరం వ్యక్తం చేసింది. “భారత మ్యాప్ విషయంలో తప్పుగా వ్యవహరించవద్దు. నాకు చాలా బాధ అనిపించింది. మన నార్త్ ఈస్ట్ లేకుండా మ్యాప్ ఉంది. అక్కడి నుంచి వచ్చిన తర్వాత కూడా అది నన్ను కలిచివేసింది. ఇప్పటికైనా తప్పును సరిదిద్దుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా” అని లవ్లీనా పేర్కొంది.

## బాటన్‌ను అందుకొన్న నీరజ్ చోప్రా

గ్లాస్గో వేదికగా కామన్వెల్త్ గేమ్స్ సంబరం ముగిసింది. దాదాపు 11 రోజులపాటు విభిన్న క్రీడలను అభిమానులు వీక్షించారు. ఆస్ట్రేలియా (171), ఇంగ్లాండ్ (110), కెనడా (62), భారత్ (39), స్కాట్లాండ్ (39) పతకాల పట్టికలో టాప్ –5లో నిలిచాయి. ముగింపు వేడుకల అనంతరం కామన్వెల్త్ గేమ్స్ బాటన్‌ను భారత్ బృందం స్వీకరించింది. భారత్ ఒలింపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పీటీ ఉషా, గుజరాత్ ఉపముఖ్యమంత్రి హర్ష్ సంఘ్వితో కలిసి జావెలిన్ త్రో స్టార్ నీరజ్ చోప్రా అందుకొన్నాడు. 2030 కామన్వెల్త్ గేమ్స్‌కు అహ్మదాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఇక ఆతిథ్య దేశం మారడాన్ని సూచిస్తూ కామన్వెల్త్ గేమ్స్ ఫ్లాగ్‌ను స్టేడియం అంతటా కలియతిప్పారు. క్రీడల అధికారిక బదిలీ కార్యక్రమం కవాతుతో ప్రారంభమైంది. ఆ ఫ్లాగ్‌ను కామన్వెల్త్ గేమ్స్ స్కాట్లాండ్ వైస్ ఛైర్మన్ సుసాన్ జాక్సన్, స్కాటిష్ నెట్ బాలర్ ఎమిలే నికోల్, కామన్వెల్త్ స్పోర్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ డొనాల్డ్ రుకారెకు గ్లాస్గో లార్డ్ ప్రొవోస్ట్ జాక్వెలిన్ మెక్‌లారెన్ అందించారు. వారి చేతుల మీదుగా నీరజ్ చోప్రా, పీటీ ఉషా, హర్ష్ సింఘ్వి స్వీకరించారు. దీంతో 2030 కామన్వెల్త్ గేమ్స్ ఆతిథ్యాన్ని స్కాట్లాండ్ నుంచి భారత్‌కు బదిలీ అయినట్లే. ముగింపు వేడుకల సందర్భంగా ఓ అద్భుతమైన ఘట్టం ఆవిష్కృతమైంది. ఒకే వేదికపై భారత్, స్కాట్లాండ్‌కు చెందిన సాంప్రదాయ నృత్యప్రదర్శనలు జరిగాయి. జాస్మైన్ భారత పతాకాన్ని మోసుకురాగా.. ఆమె వెంట మన అథ్లెట్లు వచ్చారు. ‘వసుధైక కుటుంబం’ (ద వరల్డ్ వన్ ఫ్యామిలీ) స్లోగన్‌తో ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ‘వందే మాతరం’ నినాదంతో హోరెత్తిపోయింది. శంకర్ మహదేవన్, మానుషి ఛిల్లార్ అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. భారత క్రీడా ప్రయాణాన్ని వివరిస్తూ, గుజరాత్ వారసత్వం, ఆవిష్కరణ, ఆధునిక ఆకాంక్షల సమ్మేళనాన్ని హైలైట్ చేస్తూ అహ్మదాబాద్‌ను పరిచయం చేస్తూ నిర్మించిన లఘు చిత్రం ప్రేక్షకులకు కనువిందు చేసింది.




## ఉక్రెయిన్ యుద్ధం తర్వాత.. రికార్డు స్థాయిలో రష్యా చమురు దిగుమతులు..

జులైలో రష్యా నుంచి మన దేశానికి చమురు దిగుమతులు రికార్డు గరిష్ఠానికి చేరాయి. హర్మూజ్‌లో పరిస్థితులు మెరుగుపడడంతో పశ్చిమాసియా దేశాల నుంచి చమురు సరఫరా చేసుకుంటున్నప్పటికీ.. రష్యా నుంచి కూడా జులైలో దిగుమతులు రోజుకు 2.8 మిలియన్ బ్యారెళ్ల స్థాయికి చేరుకున్నాయి. 2022లో రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇంత భారీ స్థాయిలో దిగుమతి చేసుకోవడం ఇదే మొదటిసారి. షిప్ ట్రాకింగ్ సంస్థ కెప్లర్ ప్రకారం.. జులైలో భారత్ ప్రపంచ దేశాల నుంచి రోజుకు 5 మిలియన్ బ్యారెళ్లకు పైగా ముడి చమురును దిగుమతి చేసుకుంది. జూన్‌కంటే ఇది స్వల్పంగా అధికం. రష్యా నుంచి చమురు సరఫరా జూన్‌లో 2.7 మిలియన్ బ్యారెళ్లు ఉండగా.. జులై నాటికి 2.8మిలియన్ బ్యారెళ్లకు పెరిగింది. దీంతో దేశ ముడి చమురు దిగుమతులలో రష్యా వాటా 55.5 శాతానికి చేరింది. దిగుమతులు పెరగడానికి రష్యా చమురు నిరంతరం అందుబాటులో ఉండడమే ప్రధాన కారణమని కెప్లర్ ప్రధాన విశ్లేషకుడు నిఖిల్ దుబె పేర్కొన్నారు. అయితే ఎల్‌పీజీ దిగుమతులకు మాత్రం భారత్.. అమెరికా వైపే మొగ్గు చూపింది. జులైలో దిగుమతి చేసుకున్న మొత్తం 1.2 మిలియన్ టన్నులకు పైగా ఎల్‌పీజీలో సుమారు 73శాతం అగ్రరాజ్యం నుంచే కొనుగోలు చేసింది.

### పశ్చిమాసియా నుంచి పెరుగుతున్న దిగుమతులు..

జులై నుంచి భారతీయ రిఫైనరీలు పశ్చిమాసియా సరఫరాదారుల నుంచి కొనుగోళ్లను పెంచినట్లు కెప్లర్ వెల్లడించింది. వీటిలో ప్రధాన సరఫరాదారుగా సౌదీఅరేబియా నిలిచింది. ఆ దేశం నుంచి జూన్‌లో రోజుకు 2.9 లక్షల బ్యారెళ్ల చమురు దిగుమతి చేసుకోగా.. జులైలో అవి 4.2 లక్షల బ్యారెళ్లకు పెరిగాయి. ఇరాక్, కువైట్‌ల నుంచి కూడా చమురు దిగుమతులు తిరిగి ప్రారంభమయ్యాయి. మరోవైపు యూఏఈ నుంచి దిగుమతులు జూన్‌లో 5.1 లక్షల బ్యారెల్స్ ఉండగా.. జులైలో 4.6 లక్షల బ్యారెల్స్‌కు తగ్గాయి. అయినప్పటికీ అది భారత్‌కు రెండో అతిపెద్ద అతిపెద్ద ముడి చమురు సరఫరాదారుగా నిలిచింది.

## ఆహార డెలివరీ సేవల్లోకి ఫ్లిప్‌కార్ట్

### బెంగళూరులో ప్రయోగాత్మకంగా 15 నుంచి ప్రారంభం

వాల్‌మార్ట్ యాజమాన్యంలోని ఇ–కామర్స్ దిగ్గజ సంస్థ ఫ్లిప్‌కార్ట్, ఫుడ్ డెలివరీ (ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకుని, ఆహార పదార్థాలను ఇంటికి చేరవేసే) సేవలను ప్రారంభించడానికి సిద్ధమవుతోంది. ఈనెల 15 నుంచి బెంగళూరులో ఈ సేవ ప్రారంభించాలని నిర్ణయించింది. ఇప్పటికే నగరవ్యాప్తంగా రెస్టారెంట్లను తన ప్లాట్‌ఫామ్‌లో చేర్చుకోవడం మొదలుపెట్టింది. రెస్టారెంట్ భాగస్వాములను ఆకర్షించేందుకు, ప్రస్తుతం ఫుడ్ డెలివరీ ప్లాట్‌పామ్‌లు వసూలు చేస్తున్న 16–30% కమీషన్‌తో పోలిస్తే చాలా తక్కువగా 10% కమీషన్ రేటునే ఈ సంస్థ ప్రతిపాదిస్తున్నట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు వెల్లడించాయి. చాలా కాలంగా ఫుడ్ డెలివరీ సేవల్లో కొనసాగుతున్న జొమాటో, స్విగ్గీ ప్లాట్‌ఫామ్‌ల ఆధిపత్యానికి ఫ్లిప్‌కార్ట్ గండికొడుతుందని భావిస్తున్నారు. ద్విచక్ర వాహన ఆన్‌లైన్ అగ్రిగేటర్ ర్యాపిడో కూడా ఓన్లీతో ఫుడ్ డెలివరీ రంగంలోకి ఇటీవలే వచ్చిన సంగతి విదితమే. ఓఎన్‌డీసీ ద్వారా: సంప్రదాయ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌లు, తమ యాప్ నుంచే ఆహారానికి ఆర్డర్ తీసుకుంటాయి. ఫ్లిప్‌కార్ట్ ఇందుకు భిన్నంగా ప్రభుత్వ మద్దతున్న ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ)పై తన ఫుడ్ డెలివరీ సేవను ప్రారంభించనుంది. ఫ్లిప్‌కార్ట్ సీఈఓ కల్యాణ్ కృష్ణమూర్తికి ఇంతకు ముందు చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా వ్యవహరించిన ఆశిష్ విజయ్‌వర్గీవ, ప్రస్తుతం ఫ్లిప్‌కార్ట్ ఫుడ్ డెలివరీ విభాగానికి నాయకత్వం వహిస్తున్నారు. బెంగళూరులోని సుమారు 25,000 రెస్టారెంట్ల ద్వారా ర్యాపిడో ఓన్లీ రోజుకు 40,000కు పైగా ఆర్డర్ల స్థాయికి వేగంగా విస్తరించింది. కొన్ని నెలల్లోనే నగర ఫుడ్ డెలివరీ విపణిలో సుమారు 7–10% వాటాను ఈ సంస్థ దక్కించుకుంది. ఫ్లిప్‌కార్ట్ కూడా రంగంలోకి దిగితే, ఫుడ్ డెలివరీ విపణిలో ప్లాట్‌ఫామ్‌ల మధ్య పోటీ మరింత తీవ్రమవుతుంది.

జనం వార్త




## ఎల్లమ్మలో పర్షిగా దేవిశ్రీప్రసాద్ లుక్ విడుదల

దిల్ రాజు సమర్పణలో, 'రాక్‌స్టార్' దేవి శ్రీ ప్రసాద్, వేణు యెల్దండి, శిరీష్, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ 'ఎల్లమ్మ' నుంచి పర్షిగా దేవి శ్రీ ప్రసాద్ ఫస్ట్ లుక్ రిలీజ్ అయ్యింది. బలగంతో క్రేజ్ సంపాదించుకున్న దర్శకుడు వేణు యెల్దండి మరో ప్రతిష్టాత్మక చిత్రం ఎల్లమ్మను నిర్మిస్తున్నాడు. గతకొంతకాలంగా ఎల్లమ్మపై అనేక ఊహాగానాలకు తెరదించుతూ.. దేవిశ్రీప్రసాదన్‌ను హీరోగా ఎంపిక చేశారు. ఇందులో పర్షిగా అతను లుక్‌ను విడుదల చేశారు.




## ఇరుముడి నుంచి యాలాలో.. యాలాలో పాట విడుదల

మాస్ మహారాజా రవితేజ హీరోగా, కుటుంబ కథా చిత్రాల దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'ఇరుముడి' పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ ఎమోషనల్ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతుండటంతో ప్రమోషన్లను మేకర్స్ వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో చిత్రం నుంచి రెండో సింగిల్ 'యాలాలో యాలాలో.. వెన్నెల్లో ఎన్నెన్ని ముచ్చట్లో..' అనే మధురమైన ఫ్యామిలీ మెలోడీని విడుదల చేశారు. కుటుంబ బంధాలు, ఆప్యాయత, భావోద్వేగాలను ప్రతిబింబించేలా రూపొందిన ఈ పాట తొలి వినికిడిలోనే ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ పాటకు ప్రముఖ గేయ రచయిత అనంత శ్రీరామ్ హృదయాన్ని హత్తుకునే సాహిత్యం అందించగా, సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ తన మెలోడీ స్వరాలతో పాటను మరింత అందంగా తీర్చిదిద్దారు. విడుదల చేసిన పోస్టర్‌లో రవితేజ తన కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా కనిపించడం సినిమా భావోద్వేగ నేపథ్యాన్ని ప్రతిబింబిస్తోంది. ఇప్పటికే విడుదలైన తొలి పాట 'ఇరుముడి కట్టు' భక్తి గీతంగా మంచి ఆదరణ పొందింది. యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో నిలిచిన ఆ పాట తర్వాత ఇప్పుడు 'యాలాలో యాలాలో'తో సినిమా మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. 'ఇరుముడి'లో రవితేజ ఇప్పటివరకు చేయని ఓ విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారని చిత్రబృందం చెబుతోంది. తండ్రీ?కూతుళ్ల అనుబంధాన్ని ప్రధానాంశంగా తీసుకున్న ఈ కథలో అయ్యప్ప స్వామి దీక్షకు కూడా కీలక ప్రాధాన్యం ఉంది. తన కూతురి కోసం జీవితాన్ని మార్చుకునే ఓ తండ్రి ప్రయాణాన్ని భావోద్వేగభరితంగా చూపించనున్నట్లు తెలుస్తోంది. సోషల్ మీడియాలో సినిమా విడుదల తేదీపై వస్తున్న ఊహాగానాలకు కూడా మేకర్స్ తెరదించారు. ముందుగా ప్రకటించినట్లుగానే ఆగస్టు 21న 'ఇరుముడి' ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుందని అధికారికంగా స్పష్టం చేశారు. కుటుంబ అనుబంధాలు, ఆధ్యాత్మికత, మాస్ యాక్షన్ అంశాల సమ్మేళనంగా రూపొందుతున్న 'ఇరుముడి' రవితేజ కెరీర్‌లో మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందనే నమ్మకంతో అభిమానులు ఎదురుచూస్తున్నారు.

## స్పైడర్ మ్యాన్ కలక్షన్ల దూకుడు



టామ్ హాలెండ్, జెండయా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' జులై 30న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా రికార్డులు తిరగరాస్తోంది. మొదటి వారంలోనే 900 మిలియన్ డాలర్లలకు పైగా వసూళ్లు చేసినట్లు టీమ్ పేర్కొంది. ఇప్పటి వరకూ బాక్సాఫీస్ వద్ద 927 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.8,830 కోట్లు) వసూళ్లు చేసింది. దీంతో ప్రపంచ సినిమా చరిత్రలోనే రెండో అతిపెద్ద గ్లోబల్ ఓపెనింగ్ సాధించిన చిత్రంగా రికార్డు సృష్టించింది. సుమారు 225 మిలియన్ డాలర్లతో (సుమారు రూ.2,100కోట్లు) రూపొందిన ఈ సినిమా, విడుదలైన మొదటి వీకెండ్‌లోనే బ్జడెట్‌ను అధిగమించి భారీ విజయాన్ని నమోదు చేసింది. 2019లో వచ్చిన 'అవెంజర్స్: ది ఎండ్‌గేమ్' (1.2 బిలియన్ డాలర్లు) (రూ.11వేల కోట్లు) వసూళ్లు చేసి దీని కంటే ఎక్కువ ఓపెనింగ్ సాధించిన చిత్రంగా మొదటి స్థానంలో ఉంది. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లో 38వ చిత్రంగా తెరకెక్కిన 'స్పైడర్ మ్యాన్'కు ఇండియాలోనూ మంచి ఆదరణ లభిస్తోంది. ఇక్కడ ఈ చిత్రానికి రూ.310కోట్లు వచ్చినట్లు మూవీ టీమ్ వెల్లడించింది. ఇక ఈ డిసెంబర్‌లో మార్వెల్ స్టూడియోస్ నుంచి రానున్న 'అవెంజర్స్: డూమ్స్‌డే'కు ముందు ఈ 'స్పైడర్ మ్యాన్' బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలవడంతో భారీ ఉత్సాహం నెలకొంది.

# వారణాసి కథలో బలముంది

### అందుకే ఐమ్యాక్స్ ఫార్మాట్ ఎంచుకున్నా

**దర్శకధీరుడు జక్కన్న వెల్లడి**





స్టార్ హీరో మహేశ్‌బాబు కథానాయకుడిగా ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ అడ్వెంచర్ ఫిల్మ్ 'వారణాసి'లో ప్రియాంక చోప్రా కథానాయిక. పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. టైమ్ ట్రావెల్ కథాంశం, భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ మూవీకి సంబంధించిన కీలక అప్‌డేట్‌ను జక్కన్న పంచుకున్నారు. ఇటీవల ఓ ఇంటర్నేషనల్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'వారణాసి' ప్రస్తుత పరిస్థితితో పాటు, ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఇప్పటికే 'వారణాసి' 80 శాతం షూటింగ్ పూర్తయింది. ఇంకా 20శాతం ఉంది. ఈ సినిమాకు సంబంధించి కీలక సన్నివేశాలు, యాక్షన్ సీక్వెన్స్ పూర్తి చేశాం. మిగిలినవి చిన్న చిన్న సన్నివేశాలే. 2022 నుంచి 'వారణాసి' కథను డెవలప్ చేయడం మొదలు పెట్టాం. అంటే దాదాపు నాలుగున్నరేళ్లు పట్టిందని వివరించారు. వారణాసి' గురించి అన్నీ ఇప్పుడే చెప్పలేం. 'ఇండియానా జోన్స్' అంటే నాకు చాలా ఇష్టం. ఆ కథ, హీరో చేసే సాహసాలు చిన్న పిల్లలకు నచ్చుతాయి. నాకూ సరదాగా అనిపిస్తాయి. కథ, దాని నేపథ్యం తెలియకుండా ప్రేక్షకులు సినిమాను ఆస్వాదించలేరని నా అభిప్రాయం. అందుకే 'వారణాసి'కి సంబంధించి వీడియో ప్రత్యేకంగా ఉండేలా గ్లింప్స్‌ను విడుదల చేశాం. దీన్ని మీరు పరిశీలిస్తే, కథ వారణాసిలో మొదలై అంటార్కిటికా, ఆఫ్రికాల్లో ప్రయాణించి రామాయణ కాలానికి తీసుకెళుతుంది. మళ్లీ వారణాసికి తీసుకొస్తుందన్నారు. ఇక ఈ కథలో ఉన్న భారీదనమే ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో తీయడానికి కారణం. అంటార్కిటికాలో 300 అడుగులకు పైగా ఉన్న భారీ మంచు కొండ, రామాయణంలోని భారీ వానర సేన ఇలా ఎన్నో కీలక సన్నివేశాలు ఇందులో ఉన్నాయి. అవన్నీ అద్భుతంగా, విశాలంగా చూపించాలంటే ఐమ్యాక్స్ సరైనదనిపించింది. దీని వల్ల సినిమాకు అదనపు హంగు జోడించినట్లైందన్నారు. ఐమ్యాక్స్ కెమెరాలను పూర్తిగా వాడిన దర్శకుడు క్రిస్టఫర్ నోలన్. ఆయనంటే నాకు చాలా ఇష్టం. నోలన్‌ను నేనెప్పుడూ కలవలేదు. హాలీవుడ్ సినిమాలంటే నాకు ఆసక్తి. చిన్నప్పటి నుంచి వాటిని చూస్తూ పెరిగాను. ఆ ప్రభావం నా సినిమాలపై ఉంటుంది. నా సినిమాలను హాలీవుడ్ చిత్రాలతో పోలుస్తుంటారు. అందుకు నేనెప్పుడూ ఇబ్బంది పడనని అన్నారు. గత చిత్రానికి భిన్నంగా జక్కన్న 'వారణాసి'ని పరుగులు పెట్టిస్తున్నట్లు తాజా అప్‌డేట్ చూస్తే అర్థమవుతోంది. ఒకవైపు షూటింగ్ చేస్తూనే మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా వేగంగా చేస్తున్నారు. పలు అంతర్జాతీయ వీఎఫ్‌ఎక్స్ కంపెనీలు ఈ సినిమా కోసం పనిచేస్తున్నాయి. దుర్గా ఆర్ట్స్ పతాకంపై కేఎల్. నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ మూవీని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.




## నితిన్ హీరోగా నాని మూవీ

### అలియాస్ రుక్మిణీ అనే టైటిల్

హీరోగా వరుస విజయాలతో దూసుకుపోతూనే, అభిరుచి గల చిత్రాలను నిర్మిస్తూ నిర్మాతగానూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నాడు నేచురల్ స్టార్ నాని. ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. తాజాగా నాని సమర్పణలో హీరో నితిన్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న కొత్త చిత్రానికి 'అలియాస్ రుక్మిణీ ' అనే విభిన్నమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ చిత్రబృందం ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ సినీ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రానికి యువ దర్శకుడు మురళీకాంత్ దర్శకత్వం వహిస్తున్నారు. కథలో కొత్తదనం, ఆసక్తికరమైన కాన్సెప్ట్ ఉన్నట్లు టైటిల్ గ్లింప్స్ ద్వారా మేకర్స్ హింట్ ఇచ్చారు. ముఖ్యంగా ఈ వీడియోకు నాని అందించిన వాయిస్ ఓవర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్లింప్స్ ప్రారంభంలో నితిన్ ఇంజినీరింగ్ పుస్తకాల మధ్య నిద్రపోతూ కనిపిస్తాడు. అయితే అతని ముందు కనిపించే పుస్తకాల పేర్లు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. 'గరం గోపాల్', 'ఆమెకు ఆమెంటే ఇష్టం', 'వత్రం వెంకన్న' వంటి వినూత్న శీర్షికలతో ఉన్న పుస్తకాలను చూపిస్తూ వాటి రచయితగా 'రుక్మిణి' అనే పేరును ప్రస్తావిస్తారు. దీంతో ఈ రుక్మిణి ఎవరు? అనే ఆసక్తి ప్రేక్షకుల్లో పెరుగుతుంది. ఆ సమయంలో నాని వాయిస్ ఓవర్‌లో రుక్మిణి గురించి వివరిస్తుండగా, చివర్లో నితిన్ 'ఆమె నా భార్య' అని చెప్పడం గ్లింప్స్‌కు ఆసక్తికర ముగింపునిచ్చింది. ఈ ఒక్క డైలాగ్‌తోనే సినిమా కథపై మరింత క్యూరియాసిటీ పెరిగింది. 'అలియాస్ రుక్మిణి' అనే టైటిల్ వెనుక ఉన్న రహస్యం ఏమిటి? రుక్మిణీ పాత్ర కథలో ఎంత కీలకమనే అంశాలపై చర్చ మొదలైంది. నితిన్ కెరీర్‌లో ఇది మరో విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న చిత్రం అని తెలుస్తోంది. రొమాన్స్, కామెడీ, ఎమోషన్స్‌తో పాటు ఒక ప్రత్యేకమైన కాన్సెప్ట్‌ను ఈ సినిమాలో మేకర్స్ చూపించబోతున్నట్లు గ్లింప్స్ ద్వారా అర్థమవుతోంది. నాని సమర్పణలో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. గతంలో నాని నిర్మాణంలో వచ్చిన పలు చిత్రాలు విమర్శకుల ప్రశంసలతో పాటు ప్రేక్షకాదరణ కూడా పొందాయి. దీంతో 'అలియాస్ రుక్మిణి' కూడా కంటెంట్ ఆధారిత చిత్రంగా నిలుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## అతీంద్రియ శక్తుల కథ.. అగధ

### 14 రిలీజ్‌కు రెడీ అవుతున్న చిత్రం

ప్రముఖ నిర్మాత, దర్శకుడు ఎంఎస్ రాజు మరో విభిన్నమైన కథతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతున్న మిస్టికల్ థ్రిల్లర్ 'అగధ' ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తుండగా, తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు నిర్మిస్తున్నారు. ఆగస్టు 14న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలను చిత్రబృందం వేగవంతం చేసింది. అందులో భాగంగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను థ్రిల్లింగ్ ప్రపంచంలోకి తీసుకెళ్తోంది. ట్రైలర్ ప్రారంభం నుంచే మిస్టరీ, ఆధ్యాత్మికత, మంత్ర తంత్రాల నేపథ్యాన్ని ఆసక్తికరంగా పరిచయం చేశారు. 'మంత్ర తంత్ర విద్యలకు అందని శక్తి ఉంది? దాని గురించి నాకు తెలియాలి' అంటూ కామాక్షి భాస్కర్ల చెప్పే డైలాగ్ ట్రైలర్‌కు హైలైట్‌గా నిలిచింది. ఈ ఒక్క డైలాగ్‌తోనే సినిమాలో అతీంద్రియ శక్తులు, రహస్యాల చుట్టూ తిరిగే కథ ఉండబోతుందనే సంకేతాలు ఇచ్చారు. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, సినిమాటోగ్రఫీ ట్రైలర్‌కు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఉత్కంఠను పెంచేలా ఎంఎస్ రాజు కథనాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. మిస్టరీతో పాటు భావోద్వేగాలు, సస్పెన్స్ అంశాలను సమతూకంగా మేళవించినట్టు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. కామాక్షి భాస్కర్ల తన పాత్రలో ఎంతో ఎమోషన్‌ను ప్రదర్శించగా, శ్రవణ్ రెడ్డి కూడా కథలో కీలకమైన పాత్రలో ఆకట్టుకునేలా కనిపిస్తున్నారు. వీరితో పాటు ఇతర నటీనటులు కూడా కథకు తగ్గట్టుగా తమ పాత్రలకు న్యాయం చేసినట్లు ట్రైలర్ ద్వారా అర్థమవు తోంది. ఎంఎస్ రాజు గతంలో కుటుంబ కథా చిత్రాలు, ప్రేమకథలతో విజయాలు అందుకున్నప్పటికీ, ఈసారి పూర్తిగా భిన్నమైన జానర్‌ను ఎంచుకోవడం ఆసక్తికరంగా మారింది. అతీంద్రియ శక్తులు, మంత్ర తంత్రాలు, పురాతన రహస్యాల నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందనే నమ్మకంతో చిత్రబృందం ఉంది. ఇప్పటికే ట్రైలర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. విజువల్స్, కాన్సెప్ట్, కామాక్షి భాస్కర్ల నటనపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.




PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083., EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com